నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్ 1
గురువారం | 28 మార్చి 2024 | www.navatelangana.com

జూనియర్ మాస్టర్ ఒరేటర్ ఫైనల్స్‌లో సత్తాచాటిన సంగారెడ్డి నారాయణ విద్యార్థులు



నవతెలంగాణ-సంగారెడ్డి

నారాయణ విద్యాసంస్థలో ప్రతీయేడు జోన్ల వారిగా జూనియర్ మాస్టర్ ఒరేటర్ ఫైనల్ పోటీలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా ఈసారి పోటీల్లో సంగారెడ్డి బ్రాంచి నుంచి పది మంది విద్యార్థులు పాల్గొని.. వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి సత్తా చాటారు. ఈ సందర్భంగా జీఎం గోపాలరెడ్డి, ఏజీఎం వల్లికుమార్ మాట్లాడుతూ.. ఒరేటర్ ప్రోగ్రాం యొక్క ప్రాదాన్యతను వివరించారు. ఇలాంటి ప్రోగ్రామ్స్ విద్యార్థులలో పోటీతత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులను అభినందించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ హెడ్ గీత, యోగేంద్ర, సంగారెడ్డి బ్రాంచి ప్రిన్సిపాల్ లక్ష్మణ్, కోఆర్డినేటర్ రాధిక, వైస్ ప్రిన్సిపల్ తేజస్వి , శ్వేత , ఉపాధ్యాయబృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇరిగేషన్ ఏఈఈ దేవిక మృతి



నవతెలంగాణ-పటాన్‌చెరు

గుండెపోటుతో ఇరిగేషన్ ఏఈఈ బీ.దేవిక మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దిలీప్‌కుమార్(ఏఈఈ) పటాన్‌చెరు, బి.దేవిక (సంగారెడ్డి ఏఈఈ) దంపతులు నీటిపారుదల శాఖలో ఏఈఈలుగా విధులు నిర్వర్తిస్తూ పటాన్‌చెరు పట్టణ శివారులో గల కృషి డిఫెన్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. బుధవారం ఉదయం 11:30 గంటల సమయంలో ఇంట్లోనే దేవికకు గుండెపోటు రావడంతో ఇంద్రేశంలో గల మెడిస్టార్ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. వారికి మూడేండ్ల పాప, రెండేండ్ల బాబు ఉన్నారు. ఆమె మృతితో వారి కుటుంబంలో, వాళ్లు విధులు నిర్వర్తించే నీటిపారుదల శాఖలో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త దిలీప్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఉద్యోగ విరమణ తప్పనిసరి

నవతెలంగాణ-మిరుదొడ్డి

మిరుదొడ్డి మండలం కాస్లాబాద్ ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయుడు డి.వెంకటరెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కూర రఘోతంరెడ్డి హాజరయ్యారు. ప్రతి టీచర్‌కు విరమణ తప్పదని, మున్ముందు సంఘ సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో మండల విద్యాధికారి ప్రభుదాస్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు పీఆర్టీయూ నాయకులు ఇంద్రసేనారెడ్డి,పంతం వెంకట్రాజం, నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి,రాజేందర్, వెంకటేశం, మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో విచారణ చేసిన ఆర్జెడి

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మహిళా ఉద్యోగి పట్ల ప్రిన్సిపల్ లైంగికంగా వేధిస్తున్నారని.. జోగిపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంఘటనకు సంబంధించి బుధవారం మహిళా పాలిటెక్నిక్ కళాశాలల రీజినల్ డైరెక్టర్ త్రినాథ్, ఎస్ బి టీఈ టి పుల్లారావులు కళాశాలకు వచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, కళాశాల సిబ్బందితో వేరువేరుగా విచారణ చేపట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బాధితురాలు అక్కడే విధుల్లో ఉన్నప్పటికీ ఆమెను విచారించకుండానే వెళ్ళిపోయినట్టు సమాచారం. అధికారులు వచ్చి తూతూ మంత్రంగా విచారణ చేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఈ విషయమై బాధితురాలిని అడగ్గా.. తాను విధుల్లో ఉన్నప్పటికిని అధికారులు తనను ఏమీ అడగలేదని, కేవలం ప్రిన్సిపాల్ తో మాట్లాడి వెళ్లిపోయారని వివరణ ఇచ్చింది.



సెయింట్ ఆంథోనీస్‌లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో సీనియర్ కేజీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ అవార్డుల పురస్కార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఈ.కరుణాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఈ.విజయ కుమార్‌రెడ్డి సెయింట్ ఆంథోనీస్ కళాశాల ప్రిన్సిపాల్ ఈ.జ్యోతిరెడ్డిలు సరస్వతీ మాత చిత్ర పటం ఎదుట జ్యోతి ప్రజ్వలన గావించి, పటాన్ని పూలమాలతో అలంకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకున్న సీనియర్ కేజీ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం చేసి, వారిని అభినందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని.. ఈ విద్యా సంవత్సరంలో ఎదురైన అనుభవాలను చిన్నారులు తమ ప్రసంగం ద్వారా చక్కటి పదజాలంతో , అర్థమయ్యే విధంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



పోచమ్మ గుడి భూమి పూజలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మునిసిపల్ పరిధిలోని పోచమ్మ బస్తిలో గల శ్రీ శ్రీ నల్ల పోచమ్మ ఎర్ర పోచమ్మ గుడి నిర్మాణం కోసం బుధవారం జరిగిన భూమి పూజలో జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడి నిర్మాణానికి తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో బొల్లారం మునిసిపల్ పెద్దలు రంగా రెడ్డి, బాచుపల్లి బాల్ రెడ్డి ,కౌన్సిలర్ బాచుపల్లి జైపాల్ రెడ్డి, కొత్వాల్ రాజి రెడ్డి, సంజీవ్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, కృష్ణా రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.



చెంగిచెర్ల ఘటన హేయనీయం

నవతెలంగాణ-జిన్నారం

మేడ్చల్ జిల్లా చెంగిచెర్లలో హెూలీ వేడుకలు జరుపుకుంటున్న హిందువులపై ముస్లింలు దాడి చేయడం హేయనీయమైన చర్య అని జిన్నారం మండల హిందూ పరిరక్షణ సమితి అధ్యక్షులు వడ్ల ఆనంద్ అన్నారు. చెంగిచెర్ల ఘటన హేయనీయమని ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిన్నారం పోలీస్ స్టేషన్లో ఎస్సై విజయ రావు, స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ మల్లికార్జున స్వామిలకు ఆనంద్ బృందం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద్,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, ప్రతాపరెడ్డి జిల్లా ప్రతినిధి రవి,నాగులూరి నర్సింలు,యాదం వినోద్,భార్గవ్,వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అత్నూర్ గ్రామాధ్యక్షుడిగా అప్సర్



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని అత్నూర్ బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడిగి అప్సర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం జరిగిన గ్రామ కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అప్సర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు అప్సర్‌ను శాలువా, పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నిక ఉన్న వారిలో సంగ్రామ్ పాటిల్, నీలయ్యగౌడ్, వసీం, అంజన్న, గుండన్న, వీరన్న తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో..
దూకుడు పెంచిన పార్టీలు



- మూడు జిల్లాల్లో పర్యటిస్తున్న జహీరాబాద్ అభ్యర్థులు
- చేరికలు, బుజ్జగింపులు, కుల సంఘాల సమావేశాలు
- మెదక్‌లో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ప్రచారం
- అభ్యర్థిని ఖరారు చేయని కాంగ్రెస్
- ఓటర్లను కలవలేని పరిస్థితిలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటనలు
- కలిసి రానున్న పోలింగ్‌కు అధిక సమయం

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు ముందే రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి. నోటిఫికేషన్‌కు ముందే అభ్యర్థుల్ని ఖరారు చేశాయి. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కుల సంఘాలు, ఇతర సంఘాలతో సమావేశమవుతూ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మూడు పార్టీలు సైతం నువ్వా నేనా అన్నట్లుగా తలపడేందుకు సర్వ శక్తుల్ని ఒడ్డేందుకు సిద్ధమవుతున్నాయి. మెదక్, జహీరాబాద్ రెండు లోక్ సభ స్థానాల్లోనూ త్రిముఖ పోటీ ఉండనుండడంతో గెలుపు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థులు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థులు సైతం సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ మూడు జిల్లాల్లో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో సమావేశాలు, సమ్మేళనాలతో ప్రచారంలో దూసుకుపోతున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ నియోజవకర్గాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కుతుంది. మండుతున్న ఎండలకు తోడు రాజకీయ నాయకుల విమర్శలు, ప్రతి విమర్శల తీరు మరింత మంట రాజేస్తున్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మూడు పార్టీలు కూడా ఎంపీ అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో ముగ్గురు అభ్యర్థులు పోటా పోటీగా పర్యటిస్తూ పట్టు బిగిస్తున్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ మాత్రమే ఎంపీ అభ్యర్థుల్ని ప్రకటించాయి. కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థి ఖరారులో జాప్యం చేస్తుంది. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తూ సమావేశాల్లో పాల్గొంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు కాకపోవడంతో సమావేశాలు పెట్టుకునే పరిస్థితి కనిపించట్లేదు.

పోటా పోటీగా జహీరాబాద్ అభ్యర్థులు..

జహీరాబాద్ లోక్‌సభకు పోటీ చేస్తున్న మూడు పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా పర్యటిస్తూ ప్రచారంలో ముందున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుగా బరిలోకి దిగనున్న సురేష్ షేట్కర్ ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో సమావేశాలు జరుపుతున్నారు. లింగాయత్‌ల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. కార్పొరేషన్ ఏర్పాటులో షేట్కర్ క్రీయాశీల పాత్ర పోషించడంతో ఆయన్ను ఆ సామాజిక వర్గం అభినందిస్తుంది. సమ్మేళనాలు పెట్టి మద్దతు కూడ గడుతున్నారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అందోల్, నారాయణఖేడ్, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. వీర మద్దతు కూడగట్టేందుకు షేట్కర్ ముందే కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగ ఉన్న ఆయా సంఘాలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై కలుస్తున్నారు. మాజీ ఎంపీగా తనకు ఉన్న పరియాలతో పాటు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారంతా కూడా తనకు సహకరించేలా చూసుకుంటున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల కుమార్ ఇక్కడి నుంచి తొలిసారి పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్‌కు జహీరాబాద్, బాన్సువాడలో ఇద్దరు ఎమ్మెల్యేలున్నారు. వారితో పాటు మిగతా నియోజకవర్గాల్లో పార్టీ ఇంచార్జీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల్ని కలుస్తున్నారు. ఇప్పటికే పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశం పెట్టారు. పర్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా బీసీ వర్గాల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీలకు మారకుండా అంసతృప్తుల్ని బుజ్జగిస్తున్నారు. ఏడు నియోజకవర్గాల్లోనూ వ్యక్తిగా పోకస్ అయ్యేలా ప్లాన్ చేసుకుని తిరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమల్లో తలెత్తే ఇబ్బందులు, రైతుల సమస్యల్ని పోకస్ చేస్తూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరుతున్నారు. ఇక బీజేపీ నుంచి బీబీ పాటిల్ గులాబీ గూటి నుంచి వచ్చి పోటీ చేస్తున్నారు. ఆయన రెండు పర్యాయాలు బీఆర్ఎస్ నుంచి ఎంపీగా గెలిచారు. నియోజకవర్గంలో ఎంపీగా తనకంటూ చెప్పదగిన అభివృద్ధి నమున అంటూ ఏమీ లేకపోవడంతో ఇతర పార్టీల నుంచి పిరాయింపుల్ని ప్రోత్సహిస్తున్నారు. ఆయన కూడా లింగాయత్ జపం చేస్తూ మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. కామారెడ్డిలో ఆ పార్టీ ఎమ్మెల్యే తప్ప ఆరు నియోజకవర్గాల్లో బీజేపీకి పెద్దగా పట్టేమీ లేదు. వ్యక్తిగతంగా బీబీ పాటిల్‌కు పలుకుబడి, ఆర్థిక వనరులు, మోడీ ఇమేజీనే నమ్ముకుని ఆయన ముందుకెళ్తున్నారు.

మెదక్‌లో బీజేపీ, బీఆర్ఎస్‌ల మాటల యుద్ధం..

మెదక్ లోక్‌సభకు పోటీ చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఖరారు కాగానే బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత విమర్శలకు దిగారు. దుబ్బాకలో ఓడిపోయిన రఘునందన్ రావు మంచోడైతే దుబ్బాకలో ఎందుకు గెల్వలేదని, ఆయన్ను అక్కడి ప్రజలు తిరస్కరించడం వల్లనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు 54 వేల మెజార్టీ వచ్చిందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవ చేశారు. అందుకు కౌంటర్‌గా రఘునందన్‌రావు సైతం హరీశ్‌రావు, అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. హరీశ్‌రావుది కరీంనగర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి నిజామాబాద్ జిల్లాలని, వాళ్లకు సిద్దిపేట జిల్లాలో పెత్తనం చేసే నైతికత ఎక్కడిదంటూ ప్రశ్నించారు. ఎంపీ టికెట్‌ను ఉద్యమ కారులకు కాకుండా డబ్బులకు అమ్ముకున్నారంటూ ఆరోపించారు. తన గురించి పేరెత్తి మాట్లాడితే ఇంటికొచ్చి కొడతానంటూ ఘాటైన విమర్శలు చేశారు. రంగంలోకి దిగిన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల సభలు,సమావేశాలు ఘాటైన విమర్శనాస్త్రాలతో హోరెత్తిస్తున్నాయి. మెదక్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా నీలం మధును హైకమాండ్ ప్రకటించింది. దాంతో నేటి నుంచి ఆయన ప్రత్యక్షంగా ప్రచారంలోకి రానున్నారు. కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలు పెండింగ్ అభ్యర్థుల ఖరారు లో లోతైన చర్చ చేస్తున్నందున్నే ఆలస్యమవుతున్నట్లుగా చెబుతున్నారు. నామినేషన్ల ప్రక్రియలోపే అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలో దూసుకుపోవాలని కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తున్నారు.

పార్లమెంటు ఎన్నికలు బహిష్కరిస్తాం

- మా బీసీ కాలనీని పట్టించుకోకపోవడం వల్లనే నిర్ణయం
- మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయింపు
- మున్సిపల్ మేనేజర్‌కి వినతి పత్రం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బీసీ కాలనీకి తాగునీరు, మౌళిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైనందుకు నిరసనగా పార్లమెంటు ఎన్నికలు బహిష్కరిస్తామని 2వ వార్డు కౌన్సిలర్ వారాల గోపాలమ్మ వెంకటయ, బీసీ కాలనీవాసులు అన్నారు. ఈ మేరకు బుధవారం బొల్లారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు మున్సిపల్ మేనేజర్ నిర్మలా రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. బొల్లారం మున్సిపాలిటీ రెండోవార్డ్ బీసీ కాలనీ 1983లో ఏర్పడిందని.. కానీ నేటి వరకు మౌలిక వసతుల కల్పనలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నారన్నారు. ఈ కాలనీలో ఉన్న 600 ఇండ్లు ఉండగా.. 4000 మంది నివసిస్తున్నారన్నారు. కానీ ఇక్కడ కనీసం లోకల్ వాటర్ గానీ, మంజీరా నీరు గానీ లేని దుర్భర పరిస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ వ్యవస్థ సరిగా లేదని, అభివృద్ధి చెందుతున్న సమయంలో కూడా నేటికీ వీధిలైట్లు సరిగా లేవని వాపోయారు. సీసీ రోడ్లు, అంగన్వాడి కేంద్రం, బస్తి దవాఖాన, కమ్యూనిటీ హాల్, రేషన్ షాపు, పార్కు ఇలాంటి ఏ సౌకర్యం లేదని మండిపడ్డారు. 4000 మంది ప్రజానీకం నివసిస్తున్న ప్రాంతంలో రింగ్ రోడ్డుకు లోపల ప్రాంతంలో కనీసం వాకింగ్ ట్రాక్ లేకపోవడం దురదృష్టకరమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో లోకల్ బాడీ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్, లోకాయుక్త కోర్టుకి తమ సమస్యల గురించి అనేకసార్లు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. కానీ ఎటువంటి స్పందన రాలేదన్నారు. గత 30ఏండ్ల నుంచి ఓట్లు వేయించుకుంటూ అభివృద్ధిలో నిర్లక్ష్యం, కక్ష సాధింపు చర్యలు చేశారని.. దాంతో తమ ప్రాంతం తీవ్రంగా వెనకబడి పోయిందన్నారు. తమకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు కాబట్టి.. తమ కాలనీవాసులందరం నిర్ణయించుకుని మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు.

2030నాటికి మానవ మేధస్సుతో సరిపోలే కృత్రిమ మేధస్సు



నవతెలంగాణ-పటాన్‌చెరు

రానున్న ఐదారేళ్లలో.. బహుశా 2030 నాటికి మానవ మేధస్సుతో కృత్రిమ మేధ (ఏఐ) సరిపోలుతుందని, ప్రస్తుతం అది మనం నిర్దేశించిన పని చేయడానికే పరిమితమైందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, ఏఐలో ప్రఖ్యాత నిపుణుడు డాక్టర్ సిబా ఉద్గత అంచనా వేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండ్రోజుల జాతీయ కార్యశాల ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫీషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ సాధించడానికి సాధారణ జ్ఞానంతో కూడిన కృత్రిమ మేధ నమూనాలను అభివృద్ధి చేయడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.సమాచార (డేటా) సేకరణలో గోప్యత, భద్రత, న్యాయబద్ధతల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, బాధ్యతాయుత మైన కృత్రిమ మేధ అభివృద్ధి ఆవశ్యకతను ప్రొఫెసర్ ఉద్గత నొక్కి చెప్పారు. కృత్రిమ మేధలో శోధించేవారు, తాము కనుగొన్నది సమాజంపై చూపే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమస్యను గుర్తించి, దానిని నిర్వహించి, అందుకు తగ్గ పరిష్కారాలను చూపాలని విద్యార్థులను ప్రోత్సహించారు. భారతీయ నిపుణులు సమస్యకు పరిష్కారం కనుగొనడంలో దిట్ట అయినా, దానిని గుర్తించి, నిర్వచించడంలో వెనుకబడినట్టు డాక్టర్ ఉద్గత చెప్పారు. వేగంగా మారుతున్న కృత్రిమ మేధ రంగంలో పునఃనైపుణ్యం పొందం, నైపుణ్యాలను మెరుగు పరచుకోవడం ఆవశ్యకతను జియో ప్లాట్ ఫారం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆకాంక్ష కునూర్ నొక్కి చెప్పారు. ఈ రంగంలో రాణించాలంటే, పరిశ్రమ భాగస్వామ్యంతో నిరంతర అభ్యాసంతోపాటు ఇతరులతో కలిసి పనిచేయాలని సూచించారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ రాధికా మామిడి, ఆవిష్కరణల సాకారంలో యువత పాత్రను నొక్కి చెప్పారు. భవిష్యత్తు కెరీర్ అవకాశాల గురించి విద్యార్థులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. వర్చువల్ సభాధ్యక్షత వహించిన గీతం సైన్స్ డీన్ ప్రొఫెసర్ కొలప్లారు శ్రీకృష్ణ మాట్లాడుతూ, గణితం, కృత్రిమమేధ పరిశోధనలో కొత్త మార్గాలను అన్వేషించాలని, ఈ కార్యశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాదాపు 150 నుంది పాల్గొన్న ఈ వర్క్‌షాప్, కృత్రిమ మేధ, పెద్ద భాషా నమూనాలలో తాజా పురోగతులపై చర్చ, పరస్పర సహకారానికి వేదికగా నిలిచింది. కార్యశాల నిర్వాహకుడు డాక్టర్ మోతహర్ రెజా, సమన్వయకర్తలు డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, డాక్టర్ కృష్ణ, కుమ్మరి తదితరులు పాల్గొన్నారు.

పోకిరీలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-రాయికోడ్

పోకిరిలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకునే వయస్సులో విద్యార్థులు యువకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం గురించి వివరించారు. చిన్న వయసులో విద్యార్థులు వివాహాలు చేసుకుని వాళ్ళ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. నేడు జరుగుతున్న సైబర్ క్రైమ్ నేరాలను దృష్టిలో ఉంచుకొని స్మార్ట్ ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో వారి గ్రామాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాన్వి చంద్ ఉపాధ్యాయులు శిబా, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-అమీన్‌పూర్

ప్రకాశం అభివృద్ధి అధ్యయన సమస్త వారి ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ సుల్తాన్‌పూర్‌లో విరాళా కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు బ్యాగ్స్, వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మాట్లాడుతూ.. విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాల పాత్రను కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ఎంతో అవసరమన్నారు. అందుకు గాను ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. జాయింట్ సెక్రెటరీ టి.రాజశేఖర్ మాట్లాడుతూ.. విరాళాధాత కోల్నెల్ ప్రదీప్ దాతృత్వాన్ని కొనియాడారు. పాఠ్యాంశాలు అర్థం చేసుకుంటూ మంచి విషయాలు ఆచరణలో పెట్టాలని విద్యార్థులకు సూచించారు. శ్రీ టంగుటూరి శ్రీరామ్ సమస్త ప్రధాన కార్యదర్శి ప్రకాశం చరిత్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉన్నత దశకు చేరాలంటే శ్రీ ప్రకాశం, గాంధీ వంటి మహనీయుల, గొప్ప స్ఫూర్తి ప్రదాత అయిన అబ్దుల్ కలాం వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సందేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుల్తాన్పూర్ ప్రధానోపాధ్యాయులు రమాదేవి, మరియు ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రిలో మరో అరుదైన శస్త్ర చికిత్స

6 కిలోల ఇంట్రా మ్యూరల్ ఫైబ్రాయిడ్ కణతి తొలగింపు



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రిలో మరో అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట గ్రామానికి చెందిన బండారి మాధవి గత రెండేళ్లుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుంది. స్కానింగ్ లో గర్భసంచి లోపలి భాగంలో (30 x25 సెంటీమీటర్ల విస్తీర్ణం కలిగి , 6 కిలోల బరువుతో ఉన్న) ఇంట్రా మ్యూరల్ ఫైబ్రాయిడ్ కణతి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. మంగళవారం డాక్టర్ హేమరాజ్ సింగ్ నేతృత్వంలోని డాక్టర్లు రాఘవేంద్ర, నారాయణరావు బృందంతో కలిసి సుమారు 45 నిమిషాల పాటు శ్రమించి గర్భసంచికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ కణతిని విజయవంతంగా తొలగించడం జరిగిందన్నారు. ఈ శస్త్ర చికిత్సలో స్టాఫ్ నర్సులు,వైద్య సిబ్బంది ఆరోగ్యశ్రీ శ్రీహరి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించాలి..



నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మికవర్గ ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు కార్మిక, కర్షక, ప్రజానీకానికి పిలుపునిచ్చారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో బుధవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో జయరాజు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలవడం కోసమే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారన్నారు. ఢిల్లీతో పాటు, పక్క రాష్ట్రంలో సైతం ఆప్ అధికారంలో ఉండి పక్కలో బల్లెంలా మారడంతో.. లోక్‌సభ ఎన్నికలలో అడ్డుగా ఉన్నదనే సాకుతో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయటం దారుణమన్నారు. రామజన్మభూమి పేరుతో ప్రజల్లో వైశమ్యాలు పెంచుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతు నొక్కుతున్నారని, న్యూస్ క్లిక్ సంస్థ యాజమాన్యంను అరెస్ట్ చేయటాన్ని తప్పుపట్టారు. ఈడి, సీబీఐలను తమ జేబు సంస్థలుగా బీజేపీ వాడుకుంటుందని విమర్శించారు. నార్త్ ఇండియాలో బీజేపీకి ఎక్కువ సీట్స్ రావడానికి అవకాశం లేదని.. మత సెంటిమెంట్‌ను బీజేపీ తీసుకువస్తుందని దుయ్యబట్టారు. దాన్ని కాంగ్రెస్ ఎందుకు అడ్డుకోలేకపోతుందో చెప్పాలన్నారు. దేశంలో కార్మికులకు కనీస వేతనాల ను అమలు చేయలేదన్నారు. అందుకోసం బీజేపీకి ఎక్కువ సీట్స్ రావడానికి అవకాశం లేదన్నారు. ఇండియా కూటమికి ఎక్కువ సీట్లు రావడానికి అవకాశం ఉందన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలను, కార్పొరేట్ శక్తుల ఆధిపత్యాన్ని కాంగ్రెస్ ఎదుర్కోలేక పోతుందన్నారు. కేరళ, తమిలనాడు, తెలంగాణ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లో అధిక స్థానాల్లో సీపీఐ(ఎం) పోటీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య, సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి వాజీద్ అలీ,కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, పాండురంగా రెడ్డి, బీవీఆర్‌కే రాజు, వెంకట్ రామ్ రెడ్డి, రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులు డ్రోన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలి



నవతెలంగాణ-మర్కుక్

వరి పొలాల్లో మందు పిచికారి చేయడానికి రైతులు డ్రోన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన మర్కుక్ రైతు వేదికలో బుధవారం వ్యవసాయ రంగంలో డ్రోన్ పాత్ర ఉపయోగాల గురించి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైలెట్ శిక్షణ పొందిన తర్వాత మాత్రమే పిచికారి చేసుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం పూట గాని అదేవిధంగా గాలి వేగం సెకండ్‌కు 5 మీటర్ల ఎక్కువగా ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లో పిచికారి చేసుకోకూడదన్నారు. పొడిమందులు వాడినప్పుడు నాజిల్స్ ను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని హై టెన్షన్ వైర్లు ఎత్తయిన చెట్లు ఉన్నచోట జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. ఏకలవ్య ఫౌండేషన్ చైర్మెన్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రోన్ వాడకం కార్మిక వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఉత్పాదకతను పెంచుతుందన్నారు. సరైన సమయంలో సరైన మొత్తంలో పురుగుమందులను పిచికారీ చేయడానికి డ్రోన్‌లను ఉపయోగించవచ్చని, ఫలితంగా తక్కువ వృధా ఎక్కువ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఇఫ్కో సంస్థ సిద్దిపేట వారు జిల్లాలోని 6 రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు దాదాపు 16 లక్షల రూపాయల విలువగల డ్రోన్ వాహనాలను ఉచితంగా అందజేసి నందు కు జిల్లా మేనేజర్ చంద్రబాబు నాయుడు జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ పి వేణుగోపాల్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్ట్ అమరేష్, ఇఫ్కో జిల్లా మేనేజర్ చంద్రబాబు నాయుడు, మండల వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, కొండపోచమ్మ ఎఫ్‌పీసీ చైర్మన్ కొండల్ రెడ్డి, రైతులు తదితరులున్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి..



నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని చీలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బూరగోని శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100మంది బీఆర్ఎస్ నాయకులు ఎంపీ బీబీపాటిల్ సమక్షంలో బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ బీబీపాటిల్ మాట్లాడుతూ.. తన గెలుపునకు ప్రతీ కార్యకర్త పనిచేయాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంపీ బీబీపాటిల్‌పై ఉన్న అభిమానంతో తాను బీజేపీలో చేరినట్లు తెలిపారు. ఆయన గెలుపునకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో మాజీ జెడ్పీటీసీ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-రాయికోడ్



మండల పరిధిలోని కర్చల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయంలో మాజీ మండల జెడ్పీటీసీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంజయ్య, ఎంపీపీ సింగపురం మొగులప్పలు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. జైగౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆలయంలో కుంకుమార్చన, గణపతి పూజ, అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో ఎల్లవేళలా శాంతి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాబు, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఏఎంసీ చైర్మెన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మెన్ సాయి చరణ్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్లోని ఆయన నివాసంలో మాజీమంత్రి చంద్రశేఖర సమక్షంలో కేక్‌కట్ చేసి జన్మదిన సంబురాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, హన్మంతరావు పాటిల్, మక్సుద్, నర్సింహారెడ్డి, రామలింగారెడ్డి, కండేం నర్సింహులు, సీనియర్ నాయకుడు ఉగ్గేల్లి రాములు, బ్లాక్ ప్రెసిడెంట్ హర్షద్ అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీధర్ రెడ్డి

నవతెలంగాణ-జిన్నారం



నర్సాపూర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జిన్నారం మండలం సోలక్పల్లి గ్రామానికి చెందిన యువ అడ్వకేట్ దాసరి శ్రీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దాసరి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ పటిష్టవంతమైన పాత్రతో అడ్వకేట్ల సమస్యల సాధనకు అధ్యక్షుడిగా తనవంతు బాధ్యతను నెరవేరుస్తానన్నారు.



దాహం తీర్చేందుకే చలివేంద్రాలు

నవతెలంగాణ-కొండాపూర్

మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మల్లెపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు పంచాయతీ సెక్రెటరీ కటకం శ్రీనివాస్ తెలిపారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో.. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతం ప్రజలు వివిధ పనుల్లో బయటకు వచ్చిన సందర్భంలో మంచినీటి కోసం ఇబ్బందులు పడకుండా చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కటకం శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో సురేష్ షెట్కార్‌ను గెలిపించుకుంటాం

నవతెలంగాణ-మునిపల్లి

త్వరలో జరుగనున్న ఎంపీ ఎన్నికల్లో జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించుకుంటామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పెద్దగోపులారం ఎంపీటీసీ బుర్కల పాండు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో స్థానిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఆధ్వర్యంలో తామంతా ఏకతాటిపై పని చేసి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల మాదిరిగానే ఎంపీ ఎన్నికల్లో కూడా అలాంటి ఫలితాలు వస్తాయ న్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు బుడ్డమల్లేశ్, నాయకులు అమరేశ్వర్, నరేందర్ చారి, కిష్టయ్య, చంద్రయ్య, నర్సింలు పాల్గొన్నారు.

ఆసాని కుంటను కబ్జా నుంచి పరిరక్షించాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ఆసాని కుంటను పరిరక్షించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పుల్లగూర్ల లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు లక్ష్మారెడ్డి తెలిపారు. బొల్లారంలోని ఆసాని కుంట సర్వే నెంబర్ 296/7/1,296/7/2 లలో ఓ వ్యక్తి కబ్జాకి పాల్పడి షెడ్లు నిర్మించి.. వాటిని ఓ పరిశ్రమకు అద్దెకు కూడా ఇచ్చారన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మించారని, గతంలో జిన్నారం తహశీల్దార్ కబ్జా కూల్చివేసిన సదరు వ్యక్తి కబ్జాలకు పాల్పడ్డాడని.. వెంటనే విచారణ జరిపి కబ్జాలకు పాల్పడిన వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకుని ఆసాని కుంట పరిరక్షించాలని కోరారు.



ప్రథమ చికిత్స అందేలా పైలెట్లు కృషి చేయాలి

నవతెలంగాణ-కల్హేర్

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రథమ చికిత్స అందేలా అంబులెన్స్ పైలెట్లు కృషి చేయాలని 108,102 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ హుస్సేన్ అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మనూర్, కాంగ్టి, కల్హేర్, నారాయణఖేడ్ పట్టణ మండలాల 102, 108 వాహనాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలో వెహికల్ కండిషన్, ఆక్సిజన్, మెడిసిన్, ఎక్విప్మెంట్స్ ఏ విధంగా పనిచేస్తున్నాయో పరిశీలించి టెక్నీషియన్ పైలెట్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. డ్యూటీలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ట్యాబ్‌కు ఫోన్‌కాల్ వచ్చిన వెంటనే 30 సెకండ్లలో వెహికల్ మూవ్ చేసి వీలైనంత తొందరగా పేషెంట్లను టేకప్ చేసి ప్రథమ చికిత్స అందించాలన్నారు. వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో 102 పైలెట్ రాజు 108,102 తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది కీలక బాధ్యత

- సెక్టార్ అధికారులకు మాక్‌పోల్ శిక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి



ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడినప్పటి నుంచి.. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులే కీలక బాధ్యతలు నిర్వహర్తించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ క్రాంతి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సంగారెడ్డి, పఠాన్ చెరువు పరిధిలోని సెక్టార్ అధికారులకు బుధవారం పోలింగ్ నిర్వహణ పై మాక్‌పోల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎల్‌సిడి ప్రొజెక్టర్ ద్వారా మాక్ పోల్ డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. సెక్టార్ అధికారులకు సాంకేతిక అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల అధికారులు, గతంలో ఎన్నికల విధులు నిర్వహించినా శిక్షణ అనేది చాల ముఖ్య మైందన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలింగ్ రోజు ప్రతీ పోలింగ్ స్టేషన్‌లలో మాక్ పోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి సెక్టార్ అధికారులకు 12 పోలింగ్ స్టేషన్ ల పరిధి ఉంటుందని, సెక్టార్ అధి కారులు ప్రతి పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలు, ఓటర్ లిస్టు ముందుగా పరిశీలించాలన్నారు. పీఓలకు వచ్చే నెల 1న, ఏపీఓలకు 2న ఎన్నికల శిక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల విధుల ఉత్తర్వులు ప్రకారం ఈ శిక్షణా కార్యక్ర మానికి హాజరు కావాలని, హాజరు కానివారికి షోకాజ్ నోటీసులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఏ ఆర్‌ఓలు, తహసీల్దార్లు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరు కావాల న్నారు. శిక్షణా కార్యక్రమంలో ట్రైనింగ్ మెటీరియల్ అందిం చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సమావేశ మందిరంలో ఈవీఎంలు ఎర్పాటు చేసి మాక్‌పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అద నపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ పద్మజారాణి, ఆర్డీఓలు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది హాజరయ్యారు.

బీఆర్ఎస్ ఎంపీ టికెట్‌ను రూ.100 కోట్లకు అమ్ముకున్నారు



నవతెలంగాణ-సంగారెడ్డి

బీఆర్ఎస్ ఎంపీ టికెట్‌ను రూ.100 కోట్లకు అమ్ముకున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. సంగారెడ్డి పట్టణంలోని అసెంబ్లీ కార్యాలయంలో పట్టణాధ్యక్షులు ద్వారకారవి ఆధ్వర్యంలో బీజేపీ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్చార్జుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావు పాల్గొని మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ ఎంపీ టికెట్‌ను 100 కోట్లకు అమ్ముకున్నారని, రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న భూములను ఎకరాకు 100 కోట్ల చొప్పున 10 ఎకరాలను అప్పట్లో కొన్నాడని, అందులోనుంచి నుంచి కేసీఆర్‌కు ఒక ఎకరం, హరీశ్‌రావుకు మరోకరం, మిగతా ఎమ్మె ల్యేలకు ఇంకో ఎకరం ఇచ్చి ఎంపీ టికెట్ను కొన్నాడని ఆరోపించారు. మెదక్ జిల్లాలో నాయకులేలేరా! ఇతర ప్రాంతాల వారికి టికెట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, సంగారెడ్డి అసెంబ్లీ ఇన్చార్జ్ పులిమామిడి రాజు, మెదక్ పార్లమెంట్ కన్వీనర్ కొవ్వూరి సంగమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఓదెల మాణిక్ రావు, కొలుకూరి రాజశేఖర్, డాక్టర్ రాజు, సుధాకర్ రెడ్డి, ద్వారక రవి, ప్రవీణ్ యాదవ్, బిజెపి మండలాధ్యక్షులు శక్తి కేంద్రం ఇన్చార్జిలు, మహిళా నాయకులు డాక్టర్ అరుణ, తేజస్విని, ఈశ్వరి రెడ్డి, మీనా గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

గాడి తప్పిన పురపాలక వ్యవస్థ

- వార్డుల్లో ఎక్కడేసిన గొంగడి అక్కడే..
- ముడుపులు ముడతే గాని కానీ ముందుకు సాగని ఫైల్..
- మంత్రి సమీక్షించినా ఫలితం శూన్యం
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నామ రవికిరణ్ విమర్శలు



నవతెలంగాణ-జహీరాబాద్

అధికారుల నిర్లక్ష్యం కారణంగా జహీరాబాద్ పురపాలిక సమస్యలకు నిలయంగా మారిందని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు నామ రవి కిరణ్ ఆరోపించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జహీరాబాద్ పురపాలక సంఘంలో గొప్పలు బారెడు పనులు మాత్రం మూరెడు అన్న పరిస్థితి నెలకొన్నదన్నారు. జహీరాబాద్ పురపాలక పరిధిలోని పాత 24 వార్డులు.. మున్సిపాల్టీలో విలీనమైన గ్రామాలతో కలిపి 37 వార్డుల్లో గత కొన్ని నెలల నుంచి పారిశుధ్యం, వీధి దీపాలు ఏర్పాటు ప్రజా సమస్యలు తీర్చడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారన్నారు.నూతనంగా మున్సిపల్‌లో విలీనమైన గ్రామాల్లో ఇంటి అసెస్మెంట్ నెంబర్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేద ప్రజలు నెలల తరబడి మున్సిపాల్టీ చుట్టూ తిరుగుతున్నా.. పనులు మాత్రం కావట్లేదని దుయ్యబట్టారు. స్థానిక వార్డుల్లో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు పాడైపోయాయని.. కనీసం ఇప్పుడు వాటిని మార్చే సిబ్బంది కూడా కరువయ్యారన్నారు. గతనెలలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహ మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించినా.. ఫలితం మాత్రం శూన్యమన్నారు. జహీరాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పడిన కాలనీల్లో వందల సంఖ్యలో బహుళ అంతస్తుల నిర్మాణాలు, జాతీయ రహదారిపై పలు వాణిజ్య కేంద్రాలకు సంబంధించిన నిర్మాణాలు ఏర్పడ్డాయన్నారు. నిర్మాణాలు చేపట్టి ఏండ్లు గడుస్తున్నా.. నిర్మాణాలకు ఆస్తిపన్నును కేటాయించి వసూలు చేయడం లేదన్నారు. అధికారుల ఉదాసీనేత వలన మున్సిపాల్టీకి కోట్ల రూపాయలలో వచ్చే ఆదాయం కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఇంచార్జ్ మంత్రి, కలెక్టర్ జహీరాబాద్ పురపాలక సంఘంపై శ్రద్ధ వహించి పేద ప్రజలను ఇబ్బంది పెడుతున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

జోగిపేట మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధిస్తున్న జోగిపేట మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె. రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఏవో పరమేశ్వర్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ.. జోగిపేట మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ అదే కళాశాలలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగురాలుని రెండేండ్లుగా లైంగికంగా వేధిస్తున్నాడని.. ఆయన్ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. రెండేండ్ల నుంచి ఈ వేధింపులు జరుగుతున్నా.. నేటికీ అధికారులు సస్పెండ్ చేయకపోవడం పట్ల మండపడ్డారు. మహిళలకు రక్షణ కల్పిస్తున్నామంటూ అటు అధికారులు ఇటు ప్రభుత్వం తరచూ చెబుతున్నా.. నేటికీ మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులకు గురవుతున్న పాలిటెక్నిక్ మహిళా ఉద్యోగికి రక్షణ కల్పించాలని కోరారు. వెంటనే జిల్లాలోని అధికారులు ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిఎడల లైంగికంగా వేధిస్తున్న ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేసే వరకు సీఐటీయూ సంగారెడ్డి జిల్లా కమిటీ పక్షాన పోరాటాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబురావు, శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సుమారు 400 మంది విద్యార్థినులకు స్వప్నిక రేహ ఫౌండేషన్ ఫౌండర్ మహాలక్ష్మీ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అమ్మాయిల వ్యక్తిగత పరిశుభ్రత, తరచుగా వచ్చే ఆరోగ్య సమస్యలు, హెచ్‌పీవీ వ్యాక్సిన్ పై అవగాహన, పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం, ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లడం అంశాలపై ముఖ్య అతిథిగా విచ్చేసిన స్పర్శ్ కౌన్సిలర్ పద్మ శేష శారద వివరించారు. అనంతరం హిమాయత్ నగర్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీ ఆనంద్ స్కూల్ అవసరాలకు ప్రింటర్ అందించారు, స్వప్నిక రేహ ఫౌండేషన్ సభ్యులు కొండల్‌రావు, రూప, జానకి, శ్రీలతలు అమ్మాయిల కోసం ఇన్సిలేటర్‌ని అందించారు. శ్రీనివాస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌వారు పిల్లలకి ప్రోటీన్ బిస్కెట్ల పంపిణీ చేశారు. డిగ్నిటి డ్రైవ్ ఫౌండేషన్ ఫౌండర్ రేనీ, స్నేహహస్తం హిమబిందులు పిల్లలందరికీ బయో డిగ్రిడబుల్ సానిటరీ నాప్కిన్స్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగిలాల్, మహిళా ఉపాధ్యాయులు ప్రతిభారాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన గణిత ఉపాధ్యాయులు సత్యం పైసాని ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

గాలి అనిల్‌కుమార్ గెలుపు ఖాయం

నవతెలంగాణ-పుల్కల్



గాలి అనిల్ కుమార్

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అయిన గాలి అనిల్‌కుమార్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు విజయ కుమార్, ప్రధాన కార్యదర్శి పడమటి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గత పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన సీఎం కేసీఆర్ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలెవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. 100 రోజుల్లో ఇచ్చిన ఆరు హామీలను నెరవేరుస్తామన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాబట్టి ప్రజలు బీఆర్ఎస్ వైపు ఉన్నారని.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ విజయం ఖాయమన్నారు.

మల్లన్న జాతర ఆహ్వాన పత్రిక విడుదల చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-రామచంద్రాపురం



రామచంద్రాపురం పట్టణంలోని మందుమూల ప్రాంతంలో గల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం, మల్లన్న జాతర ఆహ్వాన పత్రికను బుధవారం తన గృహంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కార్పొరేటర్ పుష్ప నగేష్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ.. రామచంద్రాపురం పట్టణంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల 31 నుండి ఏప్రిల్ 1 వరకు జరుగు మల్లన్న జాతర, కళ్యాణ మహెూత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మొదటి ఆహ్వాన పత్రికను నేడు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ఇవ్వడం జరిగిందన్నారు. జాతర ఏర్పాట్లను కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారని జిహెచ్ఎంసి పరంగా కూడా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో బోరు వేయించిన ఖిజర్ యఫై



నవతెలంగాణ-జహీరాబాద్

మండలంలోని ఉగ్గేల్లితాండాలో తాగునీరు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సామాజిక సేవకులు ఖిజర్ యఫై దృష్టికి తాండావాసులు తీసుకురావడంతో.. ఆయన వెంటనే స్పందించి తన సొంత నిధులతో మంగళవారం రాత్రి తాండాలో బోర్ వేయించారు. బోరులో కూడా నాలుగించుల నీళ్లు పడడంతో తాండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖిజర్ యఫైకి తాండావాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గిరిజనులు వీరు నాయక్, చంద్రు, కిషన్ రాథోడ్, రాంజీలు మాట్లాడుతూ.. నిరుపేద ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కరించే వ్యక్తిత్వం ఖిజర్ యఫైది అని కొనియాడారు. సొంత నిధులతో బోర్ వేయించి తమ దాహార్తిని తీర్చిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక సేవకులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖిజర్ యఫై మాట్లాడుతూ.. ఉగ్గేల్లితాం డాలో తాగునీటి సమస్య ఉన్నదని తెలియగానే.. బోర్ వేయించానన్నారు. మరికొన్ని గ్రామాల్లో కూడా బోర్లు వేయాలని కోరారని.. త్వరలో అక్కడ కూడా వేస్తానన్నారు. ప్రజా సేవలోనే సంతృప్తి ఉంటుందన్నారు. ఇటీవలే దిడ్గి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు రూ.3 లక్షలు వైద్య ఖర్చుల నిమిత్తం చెల్లించిన విషయం తెలిసిందే.

విద్యార్థికి ఆర్థిక సాయం అందించిన కార్పొరేటర్ సింధు

నవతెలంగాణ-రామచంద్రాపురం



రామచంద్రాపురం పట్టణంలోని గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని శ్రావ్యకు నీట్ కోచింగ్ కోసం భారతినగర్ కార్పొరేటర్ సింధు రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. పేద విద్యార్థి శ్రావ్యకు బైపీసీలో 981/1000 మంచి మార్కులు వచ్చాయి. గత నెలలో జరిగిన గీతా భూపాల్ రెడ్డి కళాశాల వార్షికోత్సవం సందర్భంగా మాజీ ప్రోటెమ్ చైర్మెన్ భూపాల్‌రెడ్డి శ్రావ్యకు ఆర్థిక సాయం అందించి విద్యాభ్యాసానికి సహకరిస్తామన్నారు. అందులో భాగంగా వీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థి శ్రావ్యకు భారతినగర్ కార్పొరేటర్ సింధు 50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి భవిష్యత్తు కోసం విద్యాభ్యాసానికి సంబంధించిన అన్ని సహాయ సహకారాలను అందిస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఉమ మహేశ్వర్, కళాశాల సిబ్బంది విజయ లక్ష్మీ, ఆరిఫ్, బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షులు పరమేశ్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేశ్ యాదవ్, శ్యామ్, శ్రావ్య లత, తల్లిదండ్రులు వెంకటరామయ్య, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాన్ని రూ.26,000 నిర్ణయించాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

రాష్ట్రంలో కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య డిమాండ్ చేశారు. బొల్లారంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ కనీస వేతనాల సవరణ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. 72 రకాల షెడ్యూల్ జీవోలను సవరిస్తూ ప్రభుత్వమిచ్చిన నోటిఫికేషన్‌లపై తీవ్రమైన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏమాత్రం వేతనాలు పెంచకుండా సవరణ చేయడం కరెక్ట్ కాదన్నారు. గతంలో కనీస వేతనాల సలహా మండలి ప్రతిపాదించిన దాన్ని కూడా పెట్టకపోవడం అవమానకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పైన కార్మికులకు ఎంతో ఆశలు ఉన్నాయన్నారు. ఆ కార్మికుల ఆశలను తుంగలో తొక్క కూడదన్నారు. గత పది, ఏండ్ల నుంచి ఏ ప్రభుత్వం కూడా కనీస వేతనాలు సవరించలేదన్నారు. ఆ ప్రభుత్వాలు పెట్టుబడిదారుల కోసమే పనిచేసేయని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వము పెట్టుబడిదారుల కోసమా, కార్మికుల కోసమా అని ఆలోచించాలన్నారు. కార్మికుల కోసం అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కనీస వేతనాన్ని పెంచకపోతే రాష్ట్రంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పైన ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయొద్దని.. పరిపాలన కార్మికులకు అనుకూలంగా ఉండాలన్నారు. కనీస వేతనాన్ని రూ.26,000కు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీధర్ రావు, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోగినాథ రథానికి పూజలు

నవతెలంగాణ-జోగిపేట



వచ్చేనెల 13 నుంచి ప్రారంభం కానున్న జోగినాత స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోగినాత రథాన్ని ఆలయం నుంచి క్రిందకు తీసుకువచ్చారు. రథానికి ప్రత్యేక పూజలు చేసి స్థానిక గౌని ఏరియా లోకి తీసుకొని వచ్చా రు. దారి పొడవున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

నవతెలంగాణ-జోగిపేట

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ అందోల్ డివిజన్ మహాసభ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్ అధ్యక్షతన బుధవారం జెండా ఎగరవేసి సమావేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సైంటిఫిక్ టెంపర్ లేని ఎన్ఈపీ -2020ని రద్దు చేయాలని, విద్యా సంస్థల్లో మతాన్ని జొప్పించడాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. బడా పెట్టుబడిదారి కంపెనీలకు జీతగాళ్లుగా తయారు చేసే విద్య విధానం రద్దుకై ఎస్ఎఫ్ఐ పోరాడుతున్నదన్నారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని లేకుండా చేస్తున్నదని ఆరోపించారు. ఎన్ ఈ పి- 2020 ని రద్దు చేసేంతవరకు విద్యార్థి ఉద్యమాన్ని ఉధృతం చేస్తా మన్నారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ ఫెలోషిప్ విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మో నిటిక్ చార్జీలు పెంచి అమలు చేయాలన్నారు. అద్దె భవనం లో నడుస్తున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాల న్నారు. అనంతరం 12 మందితో నూతన ఎస్ఎఫ్ఐ అందో ల్ డివిజన్ కమిటీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎస్ఎఫ్ఐ అందోల్ డివిజన్ అధ్యక్షురాలుగా స్నేహరెడ్డి, కార్యదర్శిగా ఎం.ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా నందు, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్, కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, గణేష్, హరీష్, శ్రీకాంత్, వాణిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయ ఽకులు శ్రీనివాస్, వివిధ కళాశాల నాయకులు పాల్గొన్నారు.

బైకును దహనం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

- చిలిపిచెడ్ మండల కేంద్రంలో అర్ధరాత్రి ఘటన



నవతెలంగాణ-చిలిపిచెడ్

మండల కేంద్రంలో అర్ధరాత్రి గ్రామానికి చెందిన గాండ్ల రాములు బైకును పెట్రోల్ పోసి నిప్పంటించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం అర్ధరాత్రి సమయంలో దుండగులు వచ్చి గేటుపై నుంచి దూకి పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం బాధితుడు మాట్లాడుతూ కావాలని కక్షపూరితంగా తన బైకును తగలబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ : ఇరువురికి గాయాలు



నవతెలంగాణ-నిజాంపేట

కారు ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటన మండల పరిధిలోని చల్మెడ గేటు వద్ద బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని నందగోకుల్ గ్రామానికి చెందిన మ్యాదరి కరుణాకర్, చౌడ స్వామి ఇద్దరు ద్విచక్ర వాహనంపై రామాయంపేట వైపు వెళ్తున్నారు. వివాహ వేడుకకు వెళ్తున్న చేగుంటకు సంబంధించిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై ఉన్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మ్యాదరి కరుణాకర్, చౌడ స్వామిలను హైదరాబాద్‌కు తరలించారు.

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు

- జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్



నవతెలంగాణ-చేగుంట

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుర్భాషలాడడం సరైంది కాదని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ విమర్శించారు. చేగుంట మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఫోన్ టాపింగ్ కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దొర అహంకారంతో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు బుడ్డ భాగ్యరాజ్ కేటీఆర్‌పై ఘాటైన విమర్శలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా ఇంకా బుద్ధి రాలేదని, కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నాడన్నారు. గతంలో రేవంత్ రెడ్డి, కేటీఆర్‌పై సవాలు విసిరితే నిజాలు బహిర్గతమైతాయని భయపడి టెస్టులకు రాలేదని ఆయన గుర్తు చేశారు. లిక్కర్స్ స్కామ్‌లో మీ చెల్లి కవిత తప్పు చేసినందుకు శిక్ష అనుభవిస్తుందని తెలుసుకోమన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం



నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలో అయిదు ఎకరాలలో సాగు చేస్తున్న అబ్దుల్ సత్తార్ ఆయిల్ పామ్ పంటను రామాయంపేట డివిజన్ సహాయ సంచాలకురాలు వసంత సుగుణ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్ పామ్ చెట్లకు మధ్యలో దూరం 9 మీటర్లు ఉంటుందని, పంట సాగుకు 4 సం.ల సమయం పడుతుందని, అప్పటి వరకు రైతులు అదనపు ఆదాయం కొరకు అంతర పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. అంతర్ పంటగా జిలుగు జునుము, పప్పు దినుసులు అయిన మినుములు, పెసర, అలసంద, నూనె పంటలైన వేరుశనగ, సోయా లాంటి పంటలు వేసుకోవచ్చని, పచ్చి రొట్టె ఎరువులతో వేసుకోవాలని సూచించారు. కోతల అనంతరం ఆ పంటలను పొలంలోనే దున్నివెస్తే అవి డీ కంపోస్ట్ జరిగి భూమి సారవంతం అవుతుందని, తదుపరి పంటలకు, ఆయిల్ పామ్ కు ఎరువుగా మారి భూమిని అనుకూలం చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు దివ్య, విజృంభణ, రైతులు సత్యం, బాచి స్వామిలు పాల్గొన్నారు.

ఘనంగా ఆవుల రాజి రెడ్డి జన్మదిన వేడుకలు

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం





నవతెలంగాణ-నర్సాపూర్

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి 53వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకుల రాజిరెడ్డి అభిమానులు బుధవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి, కార్యకర్తల, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా ఈ రక్తదాన శిబిరానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రాజిరెడ్డి అభిమానులు భారీగా తరలివచ్చి రక్తదానం చేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆవుల రాజిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాజిరెడ్డి జన్మదినం సందర్భంగా ఎస్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు హర్షవర్ధన్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని డంగోరియా, వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హర్షవర్ధన్, అశోక్, శ్రీనివాస్ గుప్తా , సురేష్ నాయక్ ,రామా గౌడ్ ,నరేష్, గోవింద్, అశోక్ గౌడ్, ఉదయ్, ఇలియాస్ కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్

- హవేలీ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లస్కర్ శ్రీనివాస్



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్ అని హవేలీ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లస్కర్ శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మెదక్ పార్లమెంటరీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నిన్న మెదక్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు మెదక్ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌గా గెలిచి బీఆర్ఎస్ పార్టీలోకి పోయి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేని అవగాహన లేకుండా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మెదక్ ఎమ్మెల్యేకు మున్సిపల్, మండల స్థాయి మీటింగ్‌లపై అవగాహన లేదని ఆరోపించడం సరికాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ బినామీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి అని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మొండి పద్మారావు, మహేష్, వెంకట్ రెడ్డి, సుభాష్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఓదార్పు



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తా వ్యాపారి గర్గ్ రాకేష్ అగర్వాల్ కుటుంబాన్ని పరామర్శించారు. బుధవారం రాకేష్ గుండెపోటుతో ఆకస్మాతుగా మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట నంగునూరి సత్యనారాయణ, అయిత సత్యనారాయణ, బాబులాల్, సురేష్, సాయిరాం, గిరీష్ మహేష్ ఉన్నారు.

మామిళ్ల ఇంటిని ముట్టడించిన మైనంపల్లి అభిమానులు

- ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికావు
- బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్
- నెలకొన్న ఉద్రిక్త పరిస్థితి.. అదుపుచేసిన డీఎస్పీ





నవతెలంగాణ-మెదక్

మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐదో వార్డు కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు ఇంటిని కాంగ్రెస్ నాయకులు, మైనంపల్లి అభిమానులు ముట్టడించి ధర్నాకు దిగిన సంఘటన బుధవారం రాత్రి మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. సుమారు గంటపాటు జరిగిన ఆందోళన ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. విషయం తెలుసుకున్న పట్టణ, రూరల్ సీఐలు కేశవులు, దిలీప్ కుమార్, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపుచేసే ప్రయత్నం చేశారు. ఖబర్దార్ మామిళ్ల అనాజనేయులు అంటూ ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డీఎస్పీ రాజేష్ రంగప్రవేశం చేసి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కొనసాగుతుందని నచ్చజెప్పి పరిస్థితిని అదుపు చేయడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు న్యాయవాది జీవన్ రావు, బొజ్జ పవన్ మాట్లాడుతూ మెదక్ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో బీఆర్ఎస్ ఐదో వార్డు కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావుపై అసభ్యకరమైన తీవ్ర పదజాలంతో వ్యాఖ్యానించినట్లు తెలిపారు. పదేళ్ల అధికార బలుపుతో ఉన్న బీఆర్ఎస్ పార్టీలోకి పదవులకు ఆశపడి, డబ్బులకు అమ్ముడుపోయి కాంగ్రెస్ పార్టీని వదిలి వెళ్ళిన ఆంజనేయులు ఎమ్మెల్యే రోహిత్‌పై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 27 ఏళ్ల యువకుడి చేతిలో ఓటమి పాలైన నాయకులు ఏం మొఖం పెట్టుకొని సభలు, సమావేశాలు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. మైనంపల్లి రోహిత్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, గురువారం ఉదయం10 గంటల వరకు భేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డీఎస్పీకి ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మైనంపల్లి అభిమానులు హమీద్, తాహెర్ తదితరులు ఉన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

- పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ నమోదులో మొదటి స్థానంలో నిలపాలి
- ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటరు నమోదుకు అవకాశం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-మెదక్

మెదక్ జిల్లాలో ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు కోరారు. నేను కచ్చితంగా ఓటు వేస్తాను మీరు కూడా ఓటు వేయండి అనే నినాదంతో బుధవారం మెదక్ కలెక్టరేట్ నుంచి రాందాస్ చౌరస్తా వరకు ఆయా శాఖ అధికారులు, పోలీస్ సిబ్బందితో స్వీప్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఓటరు అవగాహన పై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం పండుగ వాతావరణంలో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి జిల్లాలో అన్ని గ్రామాల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో అనేక అవగాహన కార్యక్రమలు చేపదుతున్నట్లు తెలిపారు. నిష్పక్షపాతంగా, స్వచ్ఛందంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా జిల్లాలో ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండి కొత్తగా ఓటు హక్కు పొందిన ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని సత్తా చాటాలన్నారు. ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటరు నమోదుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయిలో మెదక్ జిల్లా రెండవ స్థానంలో పొందినట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ లక్ష్యంగా ఓట్లు వేసి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని దాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పోలింగ్ రోజు ఎక్కడికి వెళ్లకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓట్లు వేయాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటు ద్వారా చైతన్యం వస్తుందన్నారు. బాధ్యతగా ఓటు హక్కును వినియోగించి దేశాన్ని మార్చవచ్చాన్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయి పోలింగ్ నమోదులో మెదక్ జిల్లా రెండవ స్థానం రావడం శుభ పరిణామమని ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో మొదటి స్థానం కోసం ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఏ శ్రీనివాసరావు, డీఈఓ రాధాకిషన్, డీఎస్పీ రాజేష్, జిల్లా యువజన క్రీడా అధికారి నాగరాజు, డీడబ్ల్యుఓ బ్రహ్మాజీ, ఏవో యూనస్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎన్నికల సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎత్తాల్సింది ప్రాజెక్టు గేట్లు, పార్టీ గేట్లు కావు

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-నార్సింగి

ఎత్తాల్సింది ప్రాజెక్టుల గేట్లు అని, ఇతర పార్టీల నుంచి తమ పార్టీలో చేర్చుకోవడానికి పార్టీ గేట్లు కావని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధి గ్రామమైన పెద్ద తాండాలో ఎండిన పంట పొలాలను బుధవారం ఆయన పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్ద తాండాలో అందరూ పేద గిరిజనులేనని, భూమిని నమ్ముకుని బ్రతుకుతున్న సన్నకారు రైతులన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఇబ్బందులు కలగకూడదని, రైతులు సంతోషంగా ఉండాలని రైతు బంధు, రైతు భీమా, ఫెర్టిలైజర్ వంటి సౌకర్యాలు కలిపించారని, నీటి వసతులు, 24 గంటలు ఉచిత విద్యుత్ అందించారని, అప్పుడు రైతులు హాయిగా వ్యవసాయం చేసుకుని జీవనం సాగించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక కరెంటు కష్టాలు రావడం, నీళ్ళు లేక, బోర్లు పారక పంటలు ఎండిపోయి రైతులు నష్ట పోతున్నారని బాధ పడ్డారు. గొలుసు కట్టు చెరువులతో ఒక్క చెరువు నింపితే వందల చెరువులు నిండుతాయని, సమీపంలో రామాయంపేట, శంకరంపెట్ కెనాల్ ద్వారా ఇక్కడి పరిసర ప్రాంత రైతులకు నీరు అందించ వచ్చని సూచించారు. ఒకపక్క రైతులు గ్రామాలలో పంటలు ఎండిపోయి నష్ట పోతుంటే, ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు రాజధాని హైదరాబాద్‌లో కూర్చుని గత ప్రభుత్వం ఏమి చేయలేదని మాటలు చెపుతున్నారే తప్ప చేతలు చేయడం లేదని మండి పడ్డారు. ఇప్పుడు తెరవాల్సింది ప్రాజెక్టుల గేటులని, ఇతర పార్టీల నేతలను చేర్చుకోవడానికి పార్టీ గేటులు కావని హితబోధ చేశారు. ప్రభుత్వం ఇకనైనా కళ్ళు తెరిచి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర వ్యాప్త రైతులకు నీళ్ళు అందించాలని, నష్ట పోయిన రైతులకు వెంటనే ఎకరాకు 15 వెలు నష్ట పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి జెడ్పీటీసీ బానాపురం కృష్ణా రెడ్డి, చేగుంట జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, తండా మాజీ సర్పంచ్ క్షత్రియ నాయక్, చేగుంట మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, పెద్ద తాండా పార్టీ అధ్యక్షుడు బాషా నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేశం గౌడ్ తాండా ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రమేష్





నవతెలంగాణ-నర్సాపూర్

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో ,పట్టణాలలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నర్సాపూర్ మండల పరిధిలోని అభివృద్ధి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, మున్సిపల్ కమిషనర్, వార్డు అధికారులతో సమావేశం నిర్వహించి తాగునీటి సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేష్ మాట్లాడుతూ సిఎస్ శాంత కుమారి త్రాగునీటి సమస్యలపై జిల్లాల వారీగా చేపడుతున్న చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించిన మేరకు జిల్లా కలెక్టర్ వారి సలహాలు సూచనలు పాటిస్తూ క్షేత్రస్థాయిలో త్రాగునీటి సమస్యను నివారించేందుకు పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవికాలం ప్రారంభమైనందున నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని అన్నారు. అలాగే గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాలలో మళ్లీ నీటి సమస్య కాకుండా చూడాలని అన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా చివరిలో ఉన్న ఆయా గ్రామాలలో నీటి సరఫరాకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయాలని అన్నారు. మిషన్ భగీరథ ఏఇలు అన్ని గ్రామాలు తిరిగి త్రాగునీటి సరఫరాలో కలిగే సమస్యలు గుర్తించి సరిచేయాలని సూచించారు. త్రాగు నీటిని వృధా చేయకుండా ఎలా ఉపయోగించాలో గ్రామాలలో ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ ఆఫీసర్స్ సమక్షంలో ప్రజలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి నీరు వృధా చేయకుండా వాడుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంపిఓ, పంచాయతీ సెక్రటరీలు మున్సిపల్ కమిషనర్, వార్డ్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే జాన్ డియర్ లక్ష్యం

- ఇండియాలోనే నెంబర్ వన్ ట్రాక్టర్ సేల్స్
- ఇండియాలోనే జాన్ డియార్ ట్రాక్టర్స్ ఇండియా హెడ్ శైలేందర్ జక్తాప్



నవతెలంగాణ-మెదక్

రైతుల శ్రేయస్సే జాన్ డియర్ కంపెనీ లక్ష్యమని, ట్రాక్టర్ సేల్స్ లో జాన్ డియర్ కంపెనీ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఆ కంపెనీ ఇండియా హెడ్ శైలేందర్ జక్తాప్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో చేగుంట ప్రధాన రహదారి ఎంసిహెచ్ ఆసుపత్రి సమీపంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన జాన్ డియర్ షోరూమ్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాతలు తమకు దేవుళ్ల అని, వారి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. 24 ఏండ్లలోనే ట్రాక్టర్ల అమ్మకాల్లో ఇతర కంపెనీలకు పోటీపడి దేశంలోనే 47 శాతంతో నెంబర్ వన్‌గా జాన్ డియర్ కంపెనీ ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మెదక్‌లో ఏర్పాటు చేసిన షోరూమ్ ఆసియా ఖండంలోనే అతిపెద్దది అని, ఇప్పటి వరకు 13 వేల ట్రాక్టర్లను విక్రయించి సేల్స్‌లో ముందువరుసలో ఉందన్నారు. అన్నదాతలకు మంచి సర్వీస్ ఇవ్వడంతోనే తమ కంపెనీ వైపు మొగ్గుచూపుతున్నారని చెప్పుకొచ్చారు. రైతుల సౌకర్యార్థం మరిన్ని బ్రాంచీలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రతియేటా ఇతర ట్రాక్టర్ల కంపెనీలకంటే ఎక్కువ ట్రాక్టర్లు విక్రయించడం జరిగిందన్నారు. మెదక్ షోరూమ్‌లోనే సుమారు 300 మంది ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాండ్ మేళాల మధ్య ఉద్యోగులు, సిబ్బంది నృత్యాలు చేస్తూ సందడి చేశారు. టపాసుల మోతతో షోరూమ్ ప్రాంగణమంతా పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఇండియా మార్కెటింగ్ మేనేజర్ ప్రభాస్ సెక్సేనా, సౌత్ జోన్ మేనేజర్ నవీన్ సెంగర్, డీలర్ డెవలప్మెంట్ మేనేజర్ పవన్ డీప్ సింగ్, ఏరియా మేనేజర్ కైలాష్, హనుమాన్ రాజ్, డీలర్ రాజేష్ యాదవ్, మెదక్ జనరల్ మేనేజర్ వెంకట్ రెడ్డిలతో పాటు ప్రజా ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

- జిల్లా వైద్యాధికారి శ్రీరామ్



నవతెలంగాణ-మెదక్

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ పేర్కొన్నారు. బుధవారం వరల్డ్ టీబీ డే సందర్భంగా మెదక్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి క్షయ వ్యాధి పట్ల అవగాహన అవసరమని తెలిపారు. ప్రతి ఏడాది మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవంగా నిర్వహిస్తారని, క్షయ వ్యాధిని అంతం చేయగలమనే ధీమాతో ముందుకు వెళ్తున్నారన్నారు. క్షయ వ్యాధి మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందన్నారు. ఊపిరితిత్తులు లేదా గొంతులో టీబి ఉన్న రోగి దగ్గినప్పుడు, మాట్లాడినప్పుడు వెలువడే తుంపరులను ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి పీల్చినప్పుడు ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. టీబీ వ్యాధి సాధారణంగా ఊపిరితిత్తులకు సంక్రమిస్తుంది, ఈ వ్యాధి వచ్చిన వారికి దీర్ఘకాలికంగా దగ్గు రెండు వారాలకు మించి ఉంటుందని, గళ్ళ పడటం, జ్వరం, చాతి నొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, కొన్నిసార్లు దగ్గినప్పుడు రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారు సరైన సమయంలో సంప్రదిస్తే ఛాతి ఎక్స్రే లేదా సిటీ స్కాన్, గల్ల పరీక్షలు వంటి పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించి 100 శాతం నయం చేయవచ్చు అని తెలిపారు. అయితే ఈ చికిత్స ఆరు నెలల వరకు ఉంటుందన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందజేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ విజయనిర్మల, డాక్టర్లు అరుణశ్రీ, అనిలా, పరిపాలన అధికారి డాక్టర్ నవీన్ కుమార్, టీవీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మాధురి, మాస్ మీడియా అధికారి శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ రమ, సునీల్, సూపర్వైజర్, సిబ్బంది డిపిహెచ్ఎన్ఓ లిల్లీ గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



నవతెలంగాణ-నిజాంపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిజాంపేట మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేపట్టామని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహించామని ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, మద్యం తరలించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జయపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, సునీత, కానిస్టేబుల్ రజక్, లక్ష్మణ్ గౌడ్, పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలతో గ్రామపంచాయతీ ఆదాయానికి గండి

- నాలాలను కూడా కబ్జా చేస్తున్నారు
- గ్రామపంచాయతీ అనుమతులు లేకుండానే మండల కేంద్రంలో ఎన్నో నిర్మాణాలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో ఎన్నో ఇండ్లు అక్రమంగా నిర్మిస్తున్నారని గ్రామపంచాయతీ అనుమతులు లేకుండానే ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు నిర్మిస్తున్నారు. రోడ్లను కబ్జా చేస్తూ నాలాలను కబ్జా చేస్తూ ఎవరి ఇష్టం వచ్చిన రీతిలో వారు నిర్మాణాలు చేస్తున్నారని గ్రామంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ఏ చిన్నపాటి పని చేయాలన్న గ్రామ పంచాయతీ అనుమతి తప్పనిసరి, అనగా బాత్రూం నిర్మించాలన్న, నూతనంగా దర్వాజాలు పెట్టుకోవాలన్నా కాంపౌండ్ వాల్ పెట్టాలన్న నల్ల కనెక్షన్ తీసుకోవాలన్న, ప్రతి పనికి గ్రామపంచాయతీ పర్మిషన్ తప్పనిసరి కానీ నిజాంపేట మండల కేంద్రంలో వీటన్నింటికీ విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. మొన్నటి వరకు సర్పంచులు పాలకవర్గం కనుసన్నల్లో జరిగేవని ఎవరు పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. వీటన్నింటిపై గ్రామపంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా అనుమతులు లేని బిల్డింగులు ఉన్న మాట వాస్తవమేనని పర్మిషన్ తీసుకోవాలని వారికి ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికీ స్పందించలేదని త్వరలోనే వారందరికీ నోటీసులు జారీ చేస్తానన్నారు.

29న దుబ్బాకలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం

- మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



నవతెలంగాణ-తొగుట

దుబ్బాకలోని కోమటిరెడ్డి రజనీకర్ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఈ నెల 29న ఉదయం 11 గంటలకు నియోజక వర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి తెలిపారు. మెదక్ పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు, ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ పి వెంకట్రామరెడ్డి తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, గ్రామ, బూత్, యూత్, విద్యార్థి, సోషల్ మీడియా విభాగం ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు, కార్య కర్తలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉపాధి హామీ విజేతలకు ఘన సన్మానం

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ- గజ్వేల్

ఉన్న ఊరిలోనే ఉపాధిహామీలో పనిచేసి ఈ ఆర్థిక సంవత్సరంలో తమ హక్కును సంపూర్ణంగా ఉపయోగించుకొని డిబి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏ గొండస్వామి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజులు పూర్తి చేసుకున్న పంబాల ఏల్లవ్వ,శ్రీ రసాగర్ కనుక లక్ష్మీ కప్ప బిచ్చవ్వ, బరిగెల సుగుణ లను అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం హక్కులు, చట్టాలు సంక్షేమ పథకాల రాష్ట్ర సదస్సును నిర్వహించారన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో మక్తలు మాట్లాడుతూ ప్రతి మహిళ తమ, తమ హక్కులను ఉపయోగించుకొని శ్రామికరంగంలో రాణించాలని కోరారు.

కాంగ్రెస్ అనాలోచతో కరువు పునరావృతం

- లక్ష్మీపూర్‌లో దెబ్బతిన్న పంటల పరిశీలనలో మాజీ ఎంపీ వినోద్
- రుణాలు చెల్లించాలని బ్యాంక్ అధికారులు వేధించడం దౌర్భాగ్యం
- బ్యాంక్ అధికారులు గ్రామాల్లోకి రాకుండా సీఎం ఆదేశాలివ్వాలి
- మేడిగడ్డ వద్ద కాఫర్ డ్యాం కట్టి నీరందించాలని డిమాండ్

నవతెలంగాణ-బెజ్జంకి

కేసీఆర్ ప్రభుత్వం చెరువులు, కుంటలు నింపడం వల్ల బావుల్లో, బోరు బావుల్లో భూగర్భ జలాలు వృద్ధి చెంది రూ.కోట్ల విలువైన పంటలను రైతులు పండించారని.. కాంగ్రెస్ పార్టీ నాయకత్వ అనాలోచనతో నీళ్లుండి పంటలకు నీరందించక కరువు పునరావృతమవుతుందని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఇటీవల వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాజీ ఎమ్మెల్యే రసమయి,స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. రైతులతో మాజీ ఎంపీ మాట్లాడి దెబ్బతిన్న పంటల వివరాలను, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జలశయాలు నింపకపోవడం వల్లే పంటలకు సాగునీరందని దౌర్భాగ్య దుస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పట్ల సమయం కేటాయించకపోవడం, ప్రజా సమస్యల పరిష్కారానికి, రైతాంగానికి సాగు నీరందించే ప్రయత్నం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా మేడిగడ్డకు మరమ్మతులు చేపట్టి కాఫర్ డ్యాం నిర్మించి వాటి ద్వార మిడ్ మానేర్, అన్నపూర్ణ జలశయాలను నింపి చివరిదశలో ఉన్న సాగుపంటలు ఎండిపోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నీరందించాలని డిమాండ్ చేశారు. పంట రుణాలు చెల్లించాలని బ్యాంక్ అధికారులు రైతులను వేధింపులకు గురిచేయడం ఆ నాటి ఉద్యమ తెలంగాణ రోజులను తలపిస్తున్నాయన్నారు. రూ.2 లక్షల వరకు తీసుకున్న ప్రతి రైతు రుణాన్ని ప్రభుత్వమే చెల్లింపులు చేసేలా సీఎం రేవంత్ రెడ్డి జీఓ జారీ చేసి బ్యాంక్ అధికారులు గ్రామాల్లో తిరగకండా తక్షణమే ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. మిడ్ మానేర్ జలశయంలోని నీరును బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల రైతులకు కాల్వల ద్వార అందించి చివరిదశలో ఎండిపోకుండా ఉన్న పంటలను అదూకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలను డిమాండ్ చేశారు.



తాళి అమ్ముకుని రుణాలు చెల్లించాలంటున్నారు

పాకాల పద్మ,మహిళ రైతు, లక్ష్మీపూర్.

తాళి అమ్ముకుని పంట రుణాలను చెల్లించాలని బ్యాంక్ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక రూ.2 లక్షల రుణ మాఫి చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించి విస్మరిస్తోంది. సాగునీరందక సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. పంట నష్టపరిహారం చెల్లించి రూ.2 లక్షల రుణమాఫి హామీని ప్రభుత్వం అమలు చేయాలి.

పెద్దమ్మలోల్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా కేంద్రంలోని కాళ్లకుంట కాలనీలో 20 సంవత్సరాలుగా ఓపెన్ ప్లాట్‌లలో నివాసముంటున్న పెద్దమ్మలోల్ల కుటుంబాల సమస్యలు పరిష్కరించాలని బీఎఫ్‌టియు సిద్దిపేట జిల్లా కన్వీనర్ శివరాత్రి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సడిమెల డేవిడ్, దబ్బేట ఆనంద్‌లు అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ సుమారు 30 కుటుంబాలు నివసిస్తున్నారని, వీరికి ఇప్పటివరకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని , అధికార యంత్రాంగానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాధుడే లేడని అన్నారు. ఉపాధి లేక చెత్తకుప్పల్లో కాగితాలు, డబ్బాలు, సీసాలు, ఏరుకొని జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. వీరిని ఓటర్లు గానే చూస్తున్నారు తప్ప, వీరికి ఉండడానికి ఇండ్లు, తినడానికి తిండి లేక ఎండాకాలంలో ఎండలో, వర్షాకాలంలో వర్షంలో తడుస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. కరెంటు సౌకర్యం లేక చీకటిలో చిన్న పిల్లలను సైతం గుడిసెలు వేసుకొని రాత్రి వేళలో పాములు, చీడపురుగులతో అనేక ఇబ్బందులు పడుతూ, అరచేతిలో ప్రాణం పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు గడిచిన కొన్ని ఉపకులాలను గుర్తించకుండా, వారికి అందవలసిన ప్రభుత్వ ఫలాలను అందివ్వకుండా, ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మనుషులుగా గుర్తించి ఇండ్ల పట్టాలు ఇవ్వలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దమల్లోల కుటుంబ సభ్యులు ఎల్లవ్వ కనకయ్య, దుర్గయ్య, పోశయ్య, ఎల్లయ్య, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు కరివేద మహిపాల్ రెడ్డి
- శిలాఫలకానికి నాయకుల పాలాభిషేకం

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రం నుండి చీలాపూర్ పల్లి, చీలాపూర్, రేగులపల్లి వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను గుత్తేదారు తక్షణమే చేపట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కరివేద మహిపాల్ రెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటి కూడలి వద్ద మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కలిసి బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన శిలఫలకానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రూ.3.97 కోట్ల పంచాయతీ రాజ్ శాఖ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులపై గుత్తేదారు అలసత్వం వహించడం స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యమన్నారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతరోత్సవాలు సమీపిస్తున్న బీటీ రోడ్డు పనులను చేపట్టకపోవడం సరైందికాదని ఇప్పటికైనా జాతరోత్సవాలకు హజరయ్యే భక్తులకు ఇబ్బందులు తలెత్తుకుండా వేంటనే రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని అధికారులను సూచించారు. మండలాధ్యక్షుడు కొలిపాక రాజు, నాయకులు సత్యనారాయణ,సంగ రవి, మల్లేశం, రాములు, రమేశ్ యాదవ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారం పోగానే రైతులపై మొసలి కన్నీరు

- డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్

నవతెలంగాణ-సిద్దిపేట

స్వంత నియోజకవర్గంలో రైతులు రోడ్డు ఎక్కుతున్నా పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు, పక్క నియోజకవర్గంలో రైతులపై మొసలి కన్నీరు కార్చటం సిగ్గుచేటని, అధికారం పోగానే రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నరని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట నియోజక వర్గంలో రెండు డ్యాంలు ఉన్నప్పటికీ చెరువులు, కుంటలకు నీరు చేరే విధంగా కాలువలు తవ్వకుండా కాలయాపన చేస్తూ, రైతుల ఉసురు తీశాడన్నారు. 10సంవత్సరాలు మంత్రిగా పనిచేసి స్వంత నియోజక వర్గంలో కనీసం కాలువలు కూడా తవ్వించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో అవినీతిపై సీఎం రేవంత్ రెడ్డి పూర్తి స్థాయిలు విచారణ చేపిస్తున్నాడని, త్వరలోనే జైలుకు వెళ్లే రోజులు దగ్గర పడ్డాయన్నారు. రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల మల్లేష్ , కోదాడి రమేష్, శ్రీనివాస్ రెడ్డి , గోనెపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



అట్రాసిటీ ఫిర్యాదుపై ఏసీపీ విచారణ

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని చేబర్తికి గ్రామానికి చెందిన లింగని రవీందర్, మాజీ సర్పంచ్ బీచోటి అర్జున్ సింగ్, మధ్య దశాబ్దాల నుంచి భూ వివాదం ఉంది. ఇందులో రవీందర్ కుటుంబ సభ్యులు కబ్జాలో ఉన్నారు. ఈ భూమి తమకే చెందుతుందంటూ అర్జున్ సింగ్ కుమారులు, మరి కొంతమందితో కలిసి ఇటీవల ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో రవీందర్ ను కులం పేరుతో దూషిస్తూ రవి అతని కుటుంబ సభ్యులపై దాడి చేశారని మర్కుక్ పోలిస్ స్టేషన్‌లోకే ఇచ్చిన ఫిర్యాదుపై గజ్వేల్ ఎసిపి పురుషోత్తం రెడ్డి, మర్కుక్ ఎస్ఐతో కలసి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురిని విచారించి, కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను స్వేకరించారు. ఇరువర్గాల సమన్వయం పాటించాలి సూచించారు. భౌతిక దాడులకు ఎవరైనా పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. అయన వెంట మర్కుక్ పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.



బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

నవతెలంగాణ- గజ్వేల్

మెదక్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపిస్తామని బీజేపీ నాయకులు ఆంజనేయులు గౌడ్, మనోహర్ యాదవ్, నాగుల్ ముదిరాజ్ అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుకు ప్రతి కార్యకర్త కషి చేయాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు నమ్మరన్నారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి దొరకడం లేదని వారు విమర్శించారు. మల్లన్న సాగర్ నిర్వాసితులకు అన్యాయం చేసిన మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డిని ఓడిస్తామన్నారు. కొండపోచమ్మ , మల్లన్న సాగర్ ప్రాజెక్టుల్లో ఇళ్లు , భూములు కోల్పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాములు, ఉప్పల మధు సూదన్, శ్రీనివాస్ రెడ్డి, నత్తి శివకుమార్, ఐలాక్ మహేందర్, నరేందర్, ప్రసాద్, సందీప్, ఆర్కే యాదవ్, మహేష్ పాల్గొన్నారు.



కాల్వ పూడ్చి వేత అడ్డుకట్ట తొలగింపు చర్యలు

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలానికి సాగునీరు రాకుండా సాగునీటి కాలువలో వేసిన మట్టి అడ్డుకట్టను తొలగింపు చర్యలను బుధవారం అధికారులు చేపట్టారు. కొండపాక మండలానికి సాగునీరు రాకుండా మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో తపాస్ పల్లి రిజర్వాయర్ డి4 కెనాల్‌లో కొంతమంది వేరే ప్రాంతానికి చెందినవారు మట్టి పోసి అడ్డుకట్ట వేసి అడ్డుకున్నారు. కొండపాక మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు మండలానికి రావాల్సిన సాగునీటిని అడ్డుకోవడం సరైనది కాదని మట్టిని తొలగించడం కోసం మంగళవారం తరలి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఇరు ప్రాంతాల రైతుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడుతుందని వారిని అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. తగు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించి వారి వారి గ్రామాలకు వెళ్లిపోయారు. ఇరిగేషన్ అధికారులు బుధవారం డి4 కెనాల్‌లో వేసిన మట్టిని జెసిబితో తొలగించే చర్యలను చేపట్టారు. చర్యలు తీసుకుంటున్న సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఇరు ప్రాంతాల రైతులు అక్కడికి ఎవరిని రానివ్వకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు ప్రాంతాల్లో పోలీసులు అక్కడికి ఎవరిని వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ అధికారులు స్వయంగా అక్కడ ఉండి మట్టిని తొలగిస్తు న్నారు. ఏదిఏమైనా న్యాయంగా కొండపాక మండల రైతులకు అందాల్సిన సాగునీటిని అడ్డుకోవడం సరైనది కాదని ఈ ప్రాంత రైతులు పేర్కొన్నారు. వెంటనే సాగునీరు వచ్చే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎంపీడీవో కార్యాలయానికి నీటి కటకట

- వంతుల వారిగా పంచాయతీ ట్రాక్టర్లతో నీటి సరఫరా
- మిషన్ భగీరథ నీరు సరిపడా రాకపోవడంతో నీటి కటకట

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలకు ఏ ఇబ్బందులు లేకుండా చూస్తే మండల పరిషత్ కార్యాలయానికి నీటి కటకట ఏర్పడింది. దీంతో మండలంలోని కొన్ని గ్రామపంచాయతీలు వంతుల వారిగా గ్రామపంచాయతీ ట్రాక్టర్‌తో హరితహారం మొక్కలకు నీరు పోసే ట్యాంకర్లతో ఎంపీడీవో కార్యాలయానికి నీటి సరఫరా చేస్తున్నారు. మండల పరిషత్‌కు ఎన్నో నిధులు ఉన్న కార్యాలయానికి నీటి సౌకర్యం కల్పించుకోవడంలో మండల స్థాయి అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రభుత్వం నీటి ట్యాంకర్లను గ్రామపంచాయతీలకు అందిస్తే, మండల స్థాయి అధికారులు హరితహారం మొక్కలకు నీటి సరఫరా చేయకుండా, తమ కార్యాలయంలో నీళ్లు పోయించుకోవడం ఏంటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి ఎన్నో నిధులు ఉన్న కార్యాలయంలో నీటి సమస్య ఏర్పడడం విడ్డూరంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో నిరు ఉపయోగకరంగా బోరు ఉన్నదని అందులో ఒక మోటార్ వేసుకొని కార్యాలయానికి నీటి సమస్య లేకుండా చేసుకోవచ్చని మండల ప్రజలు కోరుతున్నారు,



సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కొండపాక

సమాజంలో అసమానతలు తొలగించేది విద్య అని ఆ విద్యను అన్ని వర్గాలకు అందించే బాధ్యత ఉపాధ్యాయులదని ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలం మంగోలు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వంగ కిష్టారెడ్డి ఉద్యోగ విరమణ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులకు విద్యను అందిస్తే వారి భవిష్యత్తును తీర్చిదిద్దిన వారమవుతామన్నారు. సందర్భంగా కిష్టారెడ్డి దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డిఇఓ శ్రీనివాసరెడ్డి, టి పి యు ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవత్ సురేష్, పి ఆర్ టి యు అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పంతం వెంకట్ రాజం, కుకునూర్ పల్లి మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు కూరెళ్ళి శ్రీనివాస రెడ్డి, కుకునూర్ శేఖర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేయొద్దు

- డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గ్రామాలలో మహిళా సంఘాలలో పనిచేసే సీఏలు, సీసీలు ఏదైనా రాజకీయ పార్టీకి అనుకూలంగా పనిచేసినా, ప్రచారం చేసినా, కండువాలు కప్పుకున్నా ఎలక్షన్ కమిషన్ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని డీఆర్డిఓ జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల పరిదిలోని సీఏలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అందరూ పాటించాలన్నారు. బ్యాంకు లింకేజీ ఈ సంవత్సరం టార్గెట్ పూర్తి చేసుకున్నందున వచ్చే సంవత్సరం టార్గెట్‌కు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్ డీఓ మధుసూదన్, డీపీఎంలు విద్యాసాగర్, కరుణాకర్, శ్రీనిధి, శ్రీనివాస్, ఏపీఎంలు శ్రీనివాస్, తిరుపతి, డీఎంజి ప్రసాద్, సీసీలు బిక్షపతి, శివచరణ్, రవీందర్, తిరుపతి, రాజు, శ్రీలత, అశోక్ పాల్గొన్నారు.





నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-మద్దూరు: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేసే భాగ్యం వైద్య సిబ్బందికి దక్కుతుందన్నారు. మూమెంట్ రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్, ఫార్మసీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సిహెచ్ఓ ప్రకాష్, సిహెచ్ఓ శేషగిరి, యూడీసీ సదయ్య, ఫార్మసిస్టు సందీప్, ఏఎస్ఎం రమ్య పాల్గొన్నారు.



పాఠశాలకు ఆర్ఓ ప్లాంట్ వితరణ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుండారం ప్రభుత్వోన్నత పాఠశాలకు స్థానికుడు వాసంపెల్లి అశోక్ రెడ్డి జ్ఞాపకార్థంగా సహచర స్నేహితులు రూ.40 వేలు విలువైన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను బుధవారం వితరణ చేశారు.హెడ్ కానిస్టేబుల్ ఎల్లయ్య గౌడ్, ప్రధానోపాద్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి, రవి, మిత్రులు సాయి చరణ్, అశోక్, బాబు, మురళి, శేఖర్, రమేష్, అనిల్, నరేష్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలో పలు వివాహాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు హాజరై నూతన వదూవరులను ఆశీర్వదించారు. పట్టణం లో బైరి అంజయ్య గార్డెన్ లో జరిగిన నంగునూర్ మండల పిఏసిఎస్ చైర్మన్ కోల రమేష్ కూతురి వివాహనికి, పోలీస్ కన్వేన్షన్ హల్‌లో జరిగిన ఎంపీడీఓ సమ్మి రెడ్డి కూతురి వివాహానికి, రెడ్డి ఫంక్షన్ హల్ లో జరిగిన కౌన్సిలర్ బింగి రాజేశం కుమారుని నిశ్చతార్థం కు, వడ్డే పల్లి దయానంద్ గార్డెన్ లో, వైశ్య కన్వేన్షన్ హల్ లో, నిమ్రా గార్డెన్, పద్మ నాయక ఫంక్షన్ హల్ లో, కొండ మల్లయ్య గార్డెన్‌లో జరిగిన వివాహలకు హాజరై నూతన వదూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి డిఎం అండ్ హెచ్ఓ పరామర్శ



నవతెలంగాణ-కొండపాక

వైద్య శాఖలో పనిచేస్తున్న జిల్లా సీనియర్ ఎంటమాలజిస్ట్, సి హెచ్ ఓ కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన ఏర్వ శ్రీనివాస్ రెడ్డి గుండెపోటుతో మరణించాడు. దీంతో ఆయన కుటుంబాన్ని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు వైద్య శాఖలో ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ వారితో పంచుకున్నారు. కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్నిచ్చారు. డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్, కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి హుండీ లెక్కింపు

నవతెలంగాణ-వర్గల్



తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతున్న సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని నాచారం శ్రీ లక్ష్మీ నరసింహ్మ స్వామి ఆలయంలో బుధవారం ఆలయ కార్య నిర్వహణ అధికారిణి అన్నపూర్ణ ఆధ్వర్యంలో దేవాదయ అధికారుల పర్యవేక్షణలో హుండీల లెక్కింపు నిర్వహించారు. 64 రోజులకు గాను మొత్తం ఆదాయం రూ.10,68,968 స్వామి ఖజానాకు వచ్చినట్లు ఆలయ ఈఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ శివరాజ్, ఆలయ సిబ్బంది సుధాకర్, నరేందర్, పాండు, నర్సింహులు, భ్రమరాంబిక సేవ సమితి సభ్యులు,భక్తులు పాల్గొన్నారు

బంజరపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ మండలం లోని బంజరు పల్లి గ్రామంలో రూ.5 లక్షలతో మంజూరైన సిసి రోడ్డు పనులను బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు బంక చందు ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు రికల రాజి రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొల్లి మను తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి ఇన్విజిలేటర్ తొలగింపు

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం దుద్దెడ పదో తరగతి పరీక్షా కేంద్రంలో ఓ ఇన్విజిలేటర్ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా వ్యవహరించాడని ఫిర్యాదు చేయడంతో డిఇఓ విచారణకు ఆదేశించినట్టు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. తన పట్ల చంద్రబాను అనే ఇన్విజిలేటర్ అసభ్యకరంగా వ్యవహరించాడని పరీక్షా కేంద్రం చీఫ్ సూపర్‌డెంట్‌కు విద్యార్థిని ఫిర్యాదు చేసింది. దాంతో ఈ విషయం డీఈవోకు తెలవడంతో వెంటనే సదరు ఉపాధ్యాయుడిని పరీక్షా కేంద్రం విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడని ఎంఈఓ తెలిపాడు. మూడు రోజుల్లో దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు ఎంఈఓ తెలిపాడు.

టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

నవతెలంగాణ- రాయపోల్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని టెట్, డీఎస్సీ అభ్యర్థుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో టెట్ ఫీజు రద్దు చేస్తామని వాగ్దానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దానికి విరుద్ధంగా టెట్ ఫీజులు పెంచి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది నిరుద్యోగులున్నారన్నారు. గతంలో టెట్, డీఎస్సీ కోసం ఎదురు చూసిన నిరుద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. గతంలో టెట్ పరీక్షకు సంబంధించి పేపర్-1కు రూ. 200, పేపర్-2 కు రూ. 200 కలిపి రూ.400 మాత్రమే ఫీజులుండేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ ఫీజులను రెండు పేపర్‌లకు కలిపి రూ.1600 పెంచారన్నారు. పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. టెట్ పరీక్ష కేంద్రాలను ఉమ్మడి జిల్లా కేంద్రాలలో కాకుండా కొత్త జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేయాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల వైద్య సేవలు



నవతెలంగాణ-మర్కుక్

ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల పాటు వైద్య సేవలు అందేలా చర్యలు చేపడతామని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సాయంత్రం మర్కుక్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నమ్మకంగా ప్రభుత్వ దవాఖానలో సేవలు వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించి రాష్ట్రంలో సిద్దిపేట జిల్లాను నెంబర్ వన్ స్థానం రాష్ట్రంలో ఏడవ స్థానంలో ఉన్న పారామీటర్ మొదటి స్థానంలోకి రావడమే ప్రథమ లక్ష్యంగా పని చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య జిల్లాగా సిద్దిపేటను ఉంచడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు. తమ సొంతూరు ఊరు సిద్దిపేటనే అని ఇకపై ఆర్ఎంపిలు ప్రాథమిక చికిత్సకే పరిమితం కావాలన్నారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డా. శ్రీనివాస్, మర్కుక్ డాక్టర్స్ దీప, శ్రీనివాస్, ప్రవీత, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులున్నారు.

ఆస్తి బకాయిలు చెల్లించనందుకు పీఎంఆర్ గార్డెన్‌కు తాళం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ పరిధిలో ఉన్న పీఎంఆర్ గార్డెన్ ఆస్తి పన్ను బకాయి చెల్లించక పోవడంతో బుధవారం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సిబ్బందితో కలిసి గార్డెన్ గేటుకు తాళం వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అత్యధిక పన్ను బకాయిలున్న స్కూల్స్, కాలేజీలు, ఫంక్షన్ హాల్స్, పెట్రోల్ బంకులు, సినిమా థియేటర్ల బకాయిలు వెంటనే చెలించాలన్నారు, పట్టణంలోని ప్రజలందరూ ఆస్తి పన్నులు ఇంట్రెస్ట్ పై 90 రాయితీ ఈ నెల 31 వరకు ఉన్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చేర్యాల పట్టణ అభివద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జె.ప్రభాకర్, సర్వర్, శ్రీనివాస్, శశి ప్రీతం, గంగాధర్, వెంకటేష్, శ్రవణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్ మీద షాక్

- సీనియర్ నాయకులు ఎలక్షన్ రెడ్డి కాంగ్రెస్‌లోకి
- కాంగ్రెస్‌లో చేరేందుకు ముహూర్తం
- నేడు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో చేరిక
- ఎలక్షన్ రెడ్డి బాటలో మరికొందరు

నవతెలంగాణ-గజ్వేల్

బీఆర్ఎస్ పార్టీకి షాక్ మీద షాక్ తగులుతోంది. మెదక్ జిల్లా రాజకీయాల్లో 40 సంవత్సరాలుగా ప్రముఖ పాత్ర పోషించిన మాజీ జెడ్పీ చైర్మన్ మణికొండ లక్ష్మీ కాంతారావు ముఖ్య అనుచరుడు, 9 సంవత్సరాల పాటు జిల్లా సహకార బ్యాంకు ఉమ్మడి మెదక్ జిల్లాకు చైర్మన్‌గా పనిచేసిన ఎలక్షన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరికపై గజ్వేల్ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఈ చేరికలను ఎవరు ప్రోత్సహిస్తున్నారనే గజ్వేల్‌లో చర్చ జరుగుతుంది. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నేత మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ బీజేపీలో చేరటానికి కాంతారావు కారణమని చెప్పడంతో రాజకీయ ప్రకంపనాలు చుట్టుకున్నాయి. అయితే ఎలక్షన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక కూడా ఎవరి హస్తం ఉందని కేసీఆర్ ఆరా తీస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జి ఎలక్షన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో గురువారం పార్టీ కండువా కప్పుకోనున్నట్లు తెలిసింది. గతంలో మెదక్ ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్‌గా, బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎలక్షన్ రెడ్డి క్రియాశీల పాత్ర పోషించగా గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ విజయానికి మూడుసార్లు క్రియాశీల నాయకునిగా పనిచేశారు. ఇటీవల పార్టీలో నెలకొన్న పరిస్థితులకు మనోవేదనకు గురైన ఎలక్షన్ రెడ్డి బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు తెలుస్తుంది.



ఉమ్మడి తూప్రాన్ మండలం ప్రస్తుత మనోహరాబాద్ మండలం రామాయపల్లి గ్రామానికి చెందిన ఎలక్షన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో ముఖ్య సీనియర్ నాయకులు. మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత సుపరిచితులైన ఎలక్షన్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తును పట్టించుకోకుండా బీఆర్ఎస్ పార్టీకి సేవలందించారు. ఈ సేవలను గుర్తించిన కేసీఆర్ 2019లో రాష్ట్ర ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. అనంతరం ఎలక్షన్ రెడ్డికి ఎలాంటి పదవులు ఇవ్వలేదు. పార్టీలో పెద్దదిక్కుగా కార్యకర్తలను కలుపుకొని పోతూ అందర్నీ సమన్వయపరిచే పేరున్న ఎలక్షన్ రెడ్డి శత్రువునైనా పలకరించి తనతో అయ్యేంతవరకు మేలు చేస్తాడు కాని కీడు తలపెట్టడనే భావం స్థానిక ప్రజల్లో ఉంది. అయితే ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో ఏర్పడిన పరిస్థితుల వల్ల తాను ఆవేదనకు గురవుతున్నట్లు తరచు పేర్కొనడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావు ఎలక్షన్ రెడ్డిని కలిసి చర్చలు జరిపినట్లు తెలిసింది. గురువారం సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సమాచారం. కాగా గజ్వేల్‌కు చెందిన ముఖ్య నాయకులు మరికొందరు కూడా కాంగ్రెస్‌లో చేరడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి.

ఇబ్రాహీంపూర్ యువకుడికి ఉద్యోగుల పంట

- ఒకటి కాదు నాలుగు ఉద్యోగాలకు ఎంపిక
- సిద్దిపేట లైబ్రరీలోనే చదువు
- తల్లిదండ్రుల సహాయంతో ఉద్యోగం సాధించా
- యువతకు ఆదర్శంగా నిలిచిన నరేష్
- ప్రశంసలు, అభినందనలు తెలుపుతున్న ఇబ్రహీంపూర్ ప్రజలు



నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

ఒక వ్యక్తి ఒక ఉద్యోగం సాధించాలంటే ఎంతో శ్రమించాలి. లక్షల మంది తో పోటీ పడాల్సి ఉంటుంది. వందల సంఖ్యలో పోస్టులు ఉంటాయి. వీటికి తోడు పేదరికం, కుటుంబం సమస్యలతో సతమతమవుతూ ఒత్తిడికి లోనవుతూ వీటన్నింటిని జయించి పట్టుదలతో ఉద్యోగం కోసం చదవాల్సి ఉంటుంది. ఇవన్నీ అతడి ముందు తలవంచాయి. ఏకంగా ఒకటి కాదు నాలుగు ఉద్యోగాలకు ఎంపికై శభాష్ అనిపించుకున్నాడు.

సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి అంజవ్వ, సత్తయ్యలకు ఒక కూతురు కుమారుడు ఉన్నారు. వీరు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. కుమారుడు నరేష్ ఏడవ తరగతి వరకు ఇబ్రహీంపూర్ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాడు. ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు సిద్దిపేట రవీంద్ర హై స్కూల్లో ఇంటర్మీడియట్ ఎస్ఎంఎస్ కళాశాల, ఇందూరు కళాశాలలో బీటెక్ పూర్తి చేసి పై చదువుల కోసం హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేశారు. ఏదో ఒక ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలనే తపనతో చదువుకుంటూ 2018లో ఏఈఈ జాబ్ ఎంపిక కాలేకపోయాడు. అప్పటి నుంచి ఉద్యోగం సాధించాలని పట్టుదలతో పక్కా ప్రణాళికతో ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ సంబంధం లేకుండా సిద్ధంగా ఉండాలని చదువును కొనసాగించాడు. ఆర్థిక స్తోమత లేక ఎటువంటి కోచింగ్ తీసుకోలేదు. సిద్దిపేట జిల్లా లైబ్రరీ లోనే ఉద్యోగానికి సాధన చేశారు. రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటలు లైబ్రరీలోని గడిపేవాడు. ఆర్థిక స్తోమతను బట్టి కొన్ని పుస్తకాలు కొనుక్కొని మరింత సమాచారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన లైబ్రరీలో పుస్తకాలను చదివి ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించాడు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్ సిర్ (టి పి బి ఓ) ఇటీవల విడుదలైన గ్రూప్ 4 ఫలితాల్లో మెరిట్ సాధించాడు. తల్లిదండ్రుల కలలు అతని లక్ష్యం నెరవేర్చి యువతకు ఆదర్శంగా నిలిచాడు. నాలుగు ఉద్యోగాలు ఎంపికైన నరేష్‌కు గ్రామ ప్రజలు యువకులు అభినందనలు తెలిపారు.



కోచింగ్ లేదు, లైబ్రరీలోనే చదువు

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే చాలామంది లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కోచింగ్ తీసుకుంటారు. కానీ కోచింగ్ లేకుండా ఉద్యోగం సాధించ వచ్చని యువతకు నరేష్ నిరూపించాడు. ఆర్థిక స్తోమత లేక పేద విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన లైబ్రరీలోనే కాంపిటేటివ్ సంబంధించిన బుక్స్ లభిస్తున్నాయని వాటిని చదువుకొని ఉద్యోగం సాధించవచ్చని నరేష్ స్పష్టం చేశారు.

నిండు మనసుతో ఆశీర్వదించండి

- మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

నవతెలంగాణ - సిద్దిపేట

మీ మధ్య బిడ్డలా మెదిలిన, ఉద్యోగిగా సేవలందించిన నన్ను నిండు మనసుతో ఆశీర్వదించాలని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేటలో పార్టీ శ్రేణుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీలో ఒకరినై సేవకుడిగా పని చేస్తానన్నారు. తన విజయానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలని కోరారు. సిద్దిపేటలో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కన్నా మరింత ఎక్కువ మెజార్టీ వచ్చేలా ప్రతి ఒక్కరు కషి చేయాలన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యల మీద లోతైన అవగాహన ఉందన్నారు. మెరుగైన పనితీరుతోనే ఇక్కడే పీడీగా జాయింట్ కలెక్టర్‌గా కలెక్టర్‌గా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో పనిచేశానన్నారు. ఉద్యోగ జీవితంలో మచ్చ లేని మనిషిగా పేరు తెచుకున్నానని పేర్కొన్నారు. కలెక్టర్‌గా రాజీనామా చేసి ప్రజా సేవలోకి అడుగుపెట్టానన్నారు. ఈ ప్రాంతంలో సుశిక్షితులైన, ఖరుడు గట్టిన, నిస్వార్థమైన బీఆర్ఎస్ కార్యకర్తలు ఉండటం నా అదష్టం అన్నారు. రాష్ట్రం అంతా కాంగ్రెస్ గాలి వీచినా మెదక్ పార్లమెంటు పరిధిలో గులాబీ హవా కొనసాగిందన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్, కేసీఆర్ మాత్రమే శ్రీరామ రక్ష అన్నారు. ఆస్తులు, అంతస్థుల కోసం రాజకీయాల్లోకి రాలేదన్నారు. కలెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిస్థాయిలో ప్రజాసేవ చేయడానికి వచ్చానన్నారు. కేసీఆర్, హరీశ్ రావు పర్యవేక్షణలో పనిచేయడం వల్లనే ఒక అధికారిగా ప్రజల మన్ననలు పొందగలిగానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావం పలికిన సంఘాల ప్రతినిధులు

సిద్దిపేట ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్స్, ముస్లిం పెద్దలు, అడ్వకేట్స్ అసోసియేషన్, సిద్దిపేట జిల్లా పద్మ శాలి సమాజం, సిద్దిపేట డాక్టర్స్ ఐఎంఏ ప్రతినిధులు కలసి వెంకట్రామారెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

- త్వరలోనే ఉపాధ్యాయ సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

నవతెలంగాణ-వర్గల్

ఉపాధ్యాయ వత్తి ఉన్నతమైనది, పవిత్రమైనదని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. పీఆర్టీయూ వర్గల్ మండల శాఖ ఆధ్వర్యంలో భాస్కర్ రెడ్డి అధ్యక్షతన బుధవారం గౌరారం శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఓఎస్ లిల్లీ ఉద్యోగ విరమణ అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి విద్యార్థిని భావి భారత పౌరుడిగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదన్నారు. గురువులు అంకితభావంతో పనిచేస్తే దేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తుందని స్పష్టం చేశారు. లిల్లీ మేడం వర్గల్ మండలంలో 34 సంవత్సరాలు పనిచేయడం గర్వకారణమని, అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయురాలుగా గుర్తింపు పొందారన్నారు. ఎన్నికల అనంతరం ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, పెండింగ్ బిల్స్, పీఆర్సీ తదితర అంశాలపై చర్చించి సమస్యలు పరిష్కరింప చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ విద్యారంగంలో పెను మార్పులు జరగబోతున్నాయన్నారు. ఉపాధ్యాయులు టెక్నాలజీకి అనుగుణంగా అప్డేట్ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, మండల విద్యాధికారి సునీత, మండల శాఖ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎంలు కనకరాజు, కష్ణ, సౌజన్య, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటరాజం, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుపతిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మండల బాధ్యులు దార శ్రీనివాస్, గాయత్రి, రజిని పాల్గొన్నారు.



ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బీ.అనురాధ

నవతెలంగాణ- దుబ్బాక

జిల్లాలో ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, పార్లమెంట్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమిష్టిగా తమ విధుల్ని నిర్వర్తించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బీ.అనురాధ అన్నారు. బుధవారం దుబ్బాక, మిరుదొడ్డి, భూంపల్లి పోలీస్ స్టేషన్‌లను ఆమె సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఫ్లాగ్ మార్చ్, ఎన్ ఫోర్స్ మెంట్ వర్క్, బైండోవర్, నాన్ బెయిలబుల్ వారెంట్, ప్రైవేట్ గన్ డిపాజిట్, పట్టుబడిన నగదు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో హింసాత్మక ఘటనలు జరగ కుండా శాంతియుతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలీసు అధికారులపై ఉందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. నిరంతరంగా వాహన తనిఖీలు చేయాలన్నారు. మత్తు పదార్థాలు, నగదు, మద్యం ఇతర ఉచిత పంపిణీలపై ప్రత్యేక దష్టి సారించాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పటిష్ట బందోబస్తుపై పలు సూచనలు చేశారు. సిద్దిపేట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ పీ.శ్రీనివాస్, ఎస్ఐలు వీ.గంగరాజు, రవికాంత్, పరశురాం, పోలీసు సిబ్బంది ఉన్నారు.



తల్లి బిడ్డల సంరక్షణ ప్రభుత్వ లక్ష్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

నవతెలంగాణ- గజ్వేల్

తల్లిబిడ్డల సంరక్షణే ప్రభుత్వ లక్షమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా గజ్వేల్ జిల్లా ఆసుపత్రిని, ప్రసూతి చిన్నపిల్లల విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి చిన్నపిల్లల విభాగంలోని వార్డులను ఆయన పరిశీలించారు. ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి సిబ్బంది, ఆశా వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో మాతృ శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి డాక్టర్ సాయి కిరణ్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. సుఖ ప్రసవం జరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తల్లి బిడ్డల సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. బిడ్డకు వ్యాధినిరోక టీకాలు వెంటనే అందించాలన్నారు. ఆయన వెంట డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్, గజ్వేల్ డాక్టర్ మంజుల, నర్సింలు. హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలకు క్రీడా పరికరాల అందజేత



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని శాకారం గ్రామ ప్రాథమిక పాఠశాలకు కోర్టేవా కంపెనీ యాజమాన్యం రూ.2.5 లక్షల విలువ చేసే క్రీడా పరికరాలను అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కోర్టేవా కంపెనీ మేనేజర్ ఉమాశంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వ్యవస్థ బలోపేతమైతేనే అభివద్ధి సాధించవచ్చన్నారు. తమ కంపెనీ శక్తి మేరకు పాఠశాలకు సహకారం అందిస్తామన్నారు. పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేసిన కంపెనీ యాజమాన్యానికి ఉపాధ్యా య బందం, విద్యార్థులు కతజ్ఞతలు తెలిపారు.

ఐక్య బ్రాహ్మణ కార్యవర్గ సభ్యుడిగా మనోహరచార్యులు ఎంపిక



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మజీద్‌పల్లి గ్రామానికి చెందిన తిరుమల మనోహర్ ఆచార్యులును ఐక్య బ్రాహ్మణ వేదిక తెలంగాణ కార్యవర్గ సభ్యులుగా బ్రాహ్మణ పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్ శర్మ, దర్శనం మాస పత్రిక సంపాదకులు వెంకటరమణ శర్మ నియమించారు. ఈ సందర్భంగా తిరుమల మనోహరాచార్య మాట్లాడుతూ కులమత తార తమ్య భేదం లేకుండా నిరంతరం కషి చేస్తానని తెలిపారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామంలో మృతి చెందిన చెప్యాల శ్రీనివాస్ కుటుంబాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన తిగుళ్ల రమేష్ మృతి చెందడంతో అతని కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

సుల్తానకు సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళ పురస్కారం



నవతెలంగాణ-రాయపోల్

ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన్ ఉమర్‌కు సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా పురస్కారం లభించింది. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అధ్యక్షతన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం రాష్ట్ర స్థాయి సావిత్రిబాయి పూలే పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా సుల్తాన ఉమర్ మాట్లాడుతూ పేద ప్రజలకు మేము చేసే సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ సత్కారం, పురస్కారం అందజేసిన డిబిఎఫ్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ కోశాధికారి ముహమ్మద్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

జిపిఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



నవ తెలంగాణ- గజ్వేల్

కీర్తి శేషులు ఆర్టిస్ట్ కొత్త బాబురావు జ్ఞాపకార్థం గజ్వేల్‌లో బుధవారం జిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గజ్వేల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు, ఈ టోర్నమెంట్‌లో 24 జట్లు పాల్గొంటాయన్నారు. మొదటి రోజు తునికి వర్సెస్ మర్కుక్, మీనాజిపేట్ వర్సెస్ జగదేవపూర్ జట్లు తలపడ్డాయన్నారు. నెల రోజుల పాటు క్రికెట్ టోర్నీ క్రీడాకారులను అలరించనుందన్నారు. ఈ కార్యక్రమంలో నికేష్, సింధు, దయానందరెడ్డి, షేర్ల భాస్కర్, కొల్ల శ్రీనివాస్, వెంకటేష్, ఖాజా పాషా, రాజు, మహేష్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



నవతెలంగాణ- దుబ్బాక

తాళం వేసిన ఇంట్లో నగలు, నగదు చోరీకి గురైన ఘటన దుబ్బాక పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయంలోని 13వ బ్లాక్‌లో తొట్ల రేణుక అనే గహిణి తన భర్త, కూతురుతో కలిసి ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. రాత్రి వచ్చే సరికి తాళం పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా పక్కనే సంచిలో ఉన్న అర తులం బంగారం, 20 తులాల వెండి, రూ.38 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే దుబ్బాక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గంగరాజు ఘటన స్థలాన్ని పరిశీలించి పలు ఆధారాల్ని సేకరించారు. బాధితురాలు రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సామాన్యులకు అండగా బీఆర్ఎస్



నవతెలంగాణ -నంగునూరు

సామాన్య ప్రజలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని బీఆర్ఎస్ యువ జన నాయకులు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలం కేంద్రానికి చెందిన సుంచనకోట యాదగిరిగౌడ్ ప్రమాదవశాత్తు నాలుగు నెళ్ల క్రితం చనిపోయిన విషయం విధితమే. మృతుడు సుంచనకోట యాదగిరికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నది. దీంతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆదేశాలతో బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ ఆర్డర్ కాపీ అందజేశామని తెలిపారు. ఈ విషయంపై మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో యాదగిరి భార్య మాధవికి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కుటుంబానికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్ ఆర్డర్ కాపీ ఇవ్వడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా చెక్ కూడా అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు ఆకుబత్తిని రాము, కోల శ్రీధర్ గౌడ్, కొండిల్లా రాజు, పాపిగారి నరేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కూడవెల్లి వాగులోకి జలకళ



నవతెలంగాణ-తొగుట

గత కొద్ది రోజులుగా భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లు, బావులు, వాగులు, వంకలలో సైతం నీటి ఎద్దడి ఏర్పడింది. బుధవారం ఆయా ప్రదేశాలలో పంటలు వాడుపట్టడంతో కూడవెల్లి వాగులోకి నీరు విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ అధికారులను రైతులు కోరారు. ఈ విషయం పై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గజ్వేల్ సమీపంలోని కొడుకండ్ల వద్ద మల్లన్నసాగర్ నుండి కొండ పోచమ్మ సాగర్‌కు వెళ్లే నీటిని వాగులోకి విడుదల చేశారు. బుధవారం ఉదయం మండలంలోని చందాపూర్ వద్దకు మొండి మత్తడి వద్దకు నీరు చేరుకుందని మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన



నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులకు బుధవారం ఐటీసీ కార్యాలయంలో హుస్నాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రెవిన్యూ డివిజనల్ అధికారి రామ్మూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేడం లింగమూర్తి, ఐలేని మల్లికార్జున్‌రెడ్డి , గడిపే మల్లేష్, డి. శ్రీనివాస్ హుస్నాబాద్ తహసిల్దార్ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రుక్మిణి పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్



నవతెలంగాణ-చేర్యాల

డబ్బు మద్యం ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్ అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట బందోబస్తు తీసుకునే చర్యల్లో భాగంగా బుధవారం చేర్యాల మండల కేంద్రంలో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి బయలు దేరి బాలాజీ థియేటర్, పెద్దమ్మగడ్డ మీదుగా శివాలయం, గాంధీ చౌక్ వరకు కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించారు ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినా కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.ఈ కార్యక్రమంలో సీఐ ఎల్.శ్రీను, చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి ఎస్ఐలు దామోదర్, యునిస్ అహమ్మద్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణకు పాల్పడితే కేసులు నమోదు

- తపస్ పల్లి ప్రభుత్వ భూమి పరిశీలిన
- బ్లాస్టింగ్ చేస్తున్న సామాగ్రి సీజ్
- అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేస్తే కేసు
- పై అధికారులకు నివేదిక పంపిస్తా
- ఎమ్మార్వో లక్ష్మీనారాయణ, ఎస్ఐ నాగరాజు



నవ తెలంగాణ -కొమురవెల్లి

ప్రభుత్వ భూముల్లో బ్లాస్టింగ్ చేస్తూ అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని తహసిల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ నాగరాజు అన్నారు. తపస్ పల్లి గ్రామంలో సర్వేనెంబర్ 93లో ఎలాంటి అనుమతులు లేకుండా బండరాళ్లను బ్లాస్టింగ్ చేస్తూ అక్రమ వ్యాపారం జరుగుతుందని పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన వారు బుధవారం భూములను సందర్శించారు. బండ రాళ్లను బ్లాస్టింగ్ చేయడానికి ఉపయోగించిన పరికరాలను సీజ్ చేసి తహసిల్దార్ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వ భూమిలో ఎవరు అనుమతులు లేకుండా ఎలాంటి పనులు చేపట్టొద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 93 లో పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తామని, ప్రస్తుతం కొంతమంది రైతులకు అసైన్మెంట్ పట్టా ఉన్నట్టు చెప్తున్నారని వారి భూములకు హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ జరుగుతున్న బండరాళ్ల బ్లాస్టింగ్ తదితర అంశాలపై నివేదిక తయారు చేసి పై అధికారులకు పంపిస్తామని తదనంతరం వచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఉల్లంఘనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు. ఇక్కడ జరుగుతున్న విషయాలపై సమాచారం ఇచ్చిన వారిని ఎవరైనా భయపెట్టి బెదిరిస్తే చట్ట పరంగా చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రభుత్వ భూములను కాపాడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ అధికారి సైదులు యాదవ్, ఆర్ ఐ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.